Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 103 మేడ్చల్ మల్కాజ్‌గిరి 5 మే 2023 శుక్రవారం పేజీలు : 4

## నివురుకప్పిన నిప్పులా చురాచాంద్‌పూర్.. సంపూర్ణ కర్ఫ్యూ

ఇంఫాల్: అల్లర్లతో అట్టుడికిన మణిపూర్‌లోని చురాచాంద్‌పూర్‌లో పరిస్థితి నివురుకప్పిన నిప్పులా ఉండటం, ఏ క్షణంలోనైనా మరిన్ని అల్లర్లకు అవకాశం ఉందనే సమాచారంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. చురాచాంద్‌పూర్‌లో సంపూర్ణ కర్ఫ్యూ విధిస్తున్నట్టు జిల్లా యంత్రాగం ప్రకటించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకూ సంపూర్ణ పబ్లిక్ కర్ఫ్యూ అమల్లో ఉంటుందని ఆదేశాలు జారీ చేసింది. చురాచాంద్‌పూర్ జిల్లా రెవెన్యూ పరిధిలో, ముఖ్యంగా కాంగ్వాల్, తయిబాంగ్, చురాచాంద్‌పూర్ సబ్ డివిజన్లలో కఠిన ఆంక్షలు అమల్లోకి తెచ్చింది. చురాచాంద్‌పూర్ జిల్లా రెవెన్యూ పరిధిలోని ఆస్తులు, ప్రాణాలకు ముప్పు ఉందని, శాంతికి విఘాతం కలిగే అవకాశం ఉందని సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ నుంచి సమాచారం అందిందని, శాంతి, ప్రజాభద్రతకు ముప్పుకలిగించే చర్యలను తక్షణం నిరోధించాలని ఆదేశించారని ఆ ప్రకటన పేర్కొంది.



# ఇక తగ్గేదే లే!

## హస్తిన నుండి సమరశంఖం పూరించిన పోరాట యోధుడు!!

ఢిల్లీ/హైదరాబాద్ : యోధుడు రణరంగాన్ని చూసి పిరికితనంతో పారిపోడు.. ధీరుడు యుద్ధ క్షేత్రంలో తన పరాక్రమాన్ని ప్రదర్శిస్తూనే ఉంటాడు తప్ప వెన్నుచూపడు. లక్ష్య సాధనలో రంగంలోకి దిగిన తర్వాత వీరోచితంగా పోరాడే వాడినే విశ్వ విజేతగా కీర్తిస్తారు. అరవీర భయంకర హాహాకారాలతో మృత్యువు వికటాట్టహాసం చేస్తూ గుండెలో వణుకు పుట్టిస్తున్నా.. చెదరని, బెదరని ఆత్మవిశ్వాపంతో కదనరంగంలో కాలుదువ్వే వాడే నిఖార్సైన నిజమైన సాహసవంతుడు. ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు జీవన ప్రయాణం మొత్తం సాహసోపేతంగా కొనసాగడంతో పాటు మేరు పర్వతం లాంటి మోదీని ఢీ కొట్టడంలో తగ్గేదేలే అనే ఆత్మవిశ్వాసం దేశానికే వినూత్న ధైర్యాన్ని రగిలిస్తోంది. 40ఇంచుల ఛాతీతో ఢిల్లీలో పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించి జాతీయ స్థాయిలో బీజేపితో అమీతుమీ తేల్చుకునేందుకు వీరోచిత అడుగులేస్తున్నారు చంద్రశేఖర్ రావు. అప్పుడు రాష్ట్రంకోసం.. ఇప్పుడు దేశం కోసం.. కేసీఆర్ కొత్త పోరాటం..:పోరాడితే పోయేదేముంది బానిస సంకెళ్లు తప్ప.. అన్న మహానుభావుడి వ్యాఖ్యలను తెలంగాణ సీఎం చంద్రశేఖర్ రావు బాగా వంటపట్టించుకున్నట్టు తెలుస్తోంది. కార్యం ఏదైనా చంద్రశేఖర్ రావు దృష్టిపెడితే దాని అంతు చూసే వరకూ విడిచిపెట్టరు. సాధించే క్రమంలో ఎన్ని కష్టాలు ఎదురైనా, ఎన్ని అవరోధాలు అడ్డొచ్చినా, ఎన్ని అవాంతరాలు కబళించి వేయాలని చూసినా చంద్రశేఖర్ రావు చాకచక్యంగా వ్యవహరిస్తారు తప్ప కాడి వదిలేసి నమ్ముకున్న సిద్ధాంతాన్ని, తనను నమ్మిన ప్రజానికాన్నీ మధ్యలో పాతరేయరు. కార్యసాధనలో చంద్రవేఖర్ రావు చూపించే తెగింపు, సాహసం, ధైర్యం, మొక్కవోనీ ఆత్మ విశ్వాసం భావితరాలకు ఓ నిఘంటువుగా పరిణమిస్తుందనడంలో ఎలాంటి సందేహం ఉండదు.

**అసాద్యాన్ని సుసాద్యం చేసిన ధీరుడు..:** తెలంగాణ సాధన ప్రక్రియలో ఎదురైన సవాళ్లను, అవమానాలను అస్త్రాలుగా మలుచుకుని సింహంలా గర్జించి ఢిల్లీ గుండెల్లో దడపుట్టించిన సాహసోపేత చరిత్ర చంద్రశేఖర్ రావుది. అసాధ్యమనుకున్న ప్రత్యేక రాష్ట్రాన్ని అంచెలంచెలుగా ముందకునడిపి సుసాధ్యం చేసి దేశానికే డైనమిజాన్ని చూపించిన నాయకుడు చంద్రశేఖర్ రావు. సాధించుకున్న తెలంగాణలో రాజకీయ అనిశ్చితి ఏర్పకుండా, అంతర్గత విప్లవాలు లేకుండా, ప్రతిపక్షాల బెదిరింపులు పట్టించుకోకుండా రాష్ట్రాన్ని రోల్ మోడల్ గా తీర్చిదిద్దడంలో చంద్రశేఖర్ రావు చూపించిన చొరవ దేశానికే గర్వకారణంగా పరిణమించింది. కూతురుపై అభియోగాలు.. ఐనా బెదరని తండ్రి..:ఏ రాష్ట్రమైనా కేంద్రప్రభుత్వ నిబంధనలకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది. ఇచ్చి పుచ్చుకోవడం వంటి కార్యకలాపాలు కూడా ఆరోగ్యవంతమైన, ఆమోదయోగ్యమైన వాతావరణంలో పరస్పర అవగాహనతో ముందుకెళ్లాలి. కేంద్ర రాష్ట్ర పరిపాలనా వ్యవస్థలో అదో ప్రధాన విధానం. కానీ కేంద్ర రాష్ట్ర సంబంధాలు పటిష్టంగా కొనసాగుతూ పరస్పర అవగాహనతో ముందుకు వెళ్లడంలో విభేదించాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మద్య ఓ పూడ్చలేని అగాధం కూడా ఏర్పడింది. అంతే కాకుండా ముఖ్యమంత్రి తనయ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పైన విచారణ సంస్థల అభియోగాలు, విచారణ రోజుకో మలుపు తీసుకుంటున్న క్రమంలో కూడా కేంద్రానికి చంద్రశేఖర్ రావు ఏమాత్రం తలవంచడంలేదు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజల మద్యే తేల్చుందాం అనే తెగింపుతో చంద్రశేఖర్ రావు అడుగులేస్తున్నారు.

**ఢిల్లీ కేంద్రంగా పోరాటం..:** దేశం నుంచి రెండు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపిలను తరిమికొట్టాలన్నదే చంద్రశేఖర్ రావు ఎజెండాగా తెలుస్తోంది. అదే క్రమంలో ప్రాంతీయ పార్టీగా ఉన్న టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చారు గులాబీ చీఫ్. బీఆర్ఎస్ పార్టీగా రూపాంతరం చెందించిన మరక్షణమే తన ఆంతర్యం ఏంటో దేశ ప్రజలకు చెప్పారు చంద్రశేఖర్ రావు. అధికారంలో ఉన్న బీజేపితో ప్రత్యక్ష యుద్ధం చేసేందుకు, ప్రతిపక్షాల మద్య ఐక్యతారాగం పాడించేందుకు నడుం బిగిస్తున్నారు. అందులో భాగంగా గురువారం ఢిల్లీ కేంద్రంగా వసంత విహార్ లో నూతన పార్టీ కార్యాలయానికి ప్రారంభోత్సవం చేశారు చంద్రశేఖర్ రావు.

దీంతో ఆయన పోరాటం తెలంగాణ టూ ఢిల్లీ వయా మహారాష్ట్ర మీదుగా దేశ రాజధాని గుండెల్లో రైళ్లు పరుగెత్తించేందుకు బీజం నాటుతున్నారు తెలంగాణ సాధకుడు చంద్రశేఖర్ రావు.



## ఓఆర్ఆర్ టెండర్లను వెంటనే రద్దు చేయాలి: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ఓఆర్ఆర్ టెండర్లను వెంటనే రద్దు చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఓఆర్ఆర్ వివాదంపై సంబంధిత మంత్రి సమాధానం ఇవ్వలేదని విమర్శించారు. సమాధానం ఇవ్వలేక మంత్రి కేటీఆర్ మొహం చాటేశారని దుయ్యబట్టారు. ఔటర్ వివాదంపై మంత్రి కేటీఆర్ ఎందుకు మౌనంగా ఉంటున్నారు? అని రేవంత్ ప్రశ్నించారు. ఓఆర్ఆర్ టెండర్లలో రూ.వేల కోట్ల దోపిడీ జరిగిందని, కేటీఆర్ సమాధానం చెప్పలేక.. అధికారులతో మాట్లాడిస్తున్నారని విమర్శించారు. రూ.70 వేల కోట్ల విలువైన ఔటర్ రింగ్ రోడ్డు.. రూ.7 వేల కోట్లకే 30 ఏళ్లకు ఎలా రాసిస్తారు? అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల ఆస్తులను ఎలా తాకట్టు పెడతారని అని నిలదీశారు. ఔటర్ రింగ్ రోడ్డుపై ఇప్పుడు ఒక్క రూపాయి కూడా రుణ భారం లేదని, కేంద్రం మార్గంలోనే తెలంగాణ సర్కార్ ప్రభుత్వ సంస్థలను అమ్ముతోందని రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు.

# కన్నడ సీమను చేజిక్కించుకోవాల్సిందే!!



## ఆరు నూరు అయినా... ఆరవ తేదీన మోడీ కర్నాటకలో భారీ రోడ్‌షో!

నరేంద్ర మోడీకి ఒక అలవాటు ఉంది ఏ రాష్ట్రంలో ఎన్నికలు ఉంటే ఆ రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలు చేయడం. ఏకంగా వారం పది రోజుల పాటు అలుపెరగకుండా కలియ తిరగడం. గత తొమ్మిదేళ్ళుగా దేశంలో అనేక రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే మోడీ ప్రచార బాధ్యతలను తన భుజాల మీద వేసుకుని పార్టీని గెలిపించుకుని వచ్చారు. అయితే ఇందులో కూడా కొన్ని పరాజయాలు ఉన్నాయి. రెండేళ్ల క్రితం పశ్చిమ బెంగాల్ లో ఎన్నికలు జరిగితే మోడీ ఎంతలా తిరిగినా కూడా అధికారం దక్కలేదు. అలాగే ఢిల్లీ కేరళ తమిళనాడు పంజాబ్ లలో సైతం అలాగే జరిగింది. ఇక ఈ ఏడాది జరిగిన హిమాచల్ ప్రదేశ్ లో సైతం మోడీ ఎంతలా ప్రచారం చేసినా అధికారాన్ని కాంగ్రెస్ దక్కించుకుంది. ఇక కర్నాటలో నువ్వా నేనా అన్నట్లుగా ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ అపుడే ప్రచార పర్వంలో బిజీగా ఉన్నారు. ఆయన ఏడున్నర పదుల వయసులో ఏ మాత్రం విరామం లేకుండా రోడ్ షోలు చేస్తున్నారు. బహిరంగ సభలలో ప్రసంగిస్తున్నారు. లోకల్ కాంగ్రెస్ నాయకుల మీద ఘాటైన విమర్శలు చేస్తున్నారు. కర్నాటకలో పోలింగ్ ఈ నెల 10న జరగనుంది. అంటే గట్టిగా వారం కూడా వ్యవధి లేదు. దాంతో మోడీ ప్రచారాన్ని పీక్స్ కి చేర్చడానికి ఈ నెల ఆరవ తేదీని ఎంచుకున్నారు. ఆ రోజున కనీ వినీ ఎరగని తీరులో మోడీతో మెగా రోడ్ షోని నిర్వహించడానికి బీజేపీ సకల సన్నాహాలు చేస్తోంది. ఈ మెగా రోడ్ షో లో ఏకంగా నలభై కిలోమీటర్ల దూరాన్ని కవర్ చేస్తారు. అలాగే ఒకే రోజు పదిహేండు నుంచి ఇరవై అసెంబ్లీ నియోజకవర్గాలను టచ్ చేస్తారు. ఇప్పటిదాకా దేశంలో ఏ రాజకీయ నాయకుడు చేయని విధంగా ఏకబిగిన ఎనిమిది గంటల పాటు సాగే ఈ రోడ్ షోలో పది లక్షల మంది ప్రజలు పాల్గొంటారు అని అంటున్నారు. ఆ విధంగా చూస్తే కనుక మోడీ చేసేది అద్భుతమైన రోడ్ షో అని చెప్పాలి. అది అల్టిమేట్ అని కూడా చెప్పాలి. మోడీ ఆ రోజు ఉదయం పదకొండు గంటల నుంచి రాత్రి పది గంటల వరకూ ఈ రోడ్ షో చేస్తారు అని అంటున్నారు. ఇప్పటికే మోడీ కర్నాటక ఎన్నికల్లో అనేక కీలకమైన నియోజకవర్గాల్లో పర్యటించారు. రోడ్ షోలను నిర్వహించారు. ప్రత్యర్ధి కాంగ్రెస్ పార్టీ మీద ఆయన విమర్శల దాడి చేస్తూ వస్తున్నారు. ఇక ఈ నెల 6న మెగా రోడ్ షో తో మోడీ కర్నాటక ఎన్నికల యుద్ధాన్ని క్లైమాక్స్ కి చేరుస్తారని బీజేపీ వర్గాలు అంటున్నాయి. ఈ మహా రోడ్ తో కన్నడ ప్రజలు తమ అభిప్రాయాన్ని పూర్తిగా బీజేపీ వైపుగా మార్చుకుంటారని ఆశాభావంతో ఉన్నారు. సౌత్ స్టేట్స్ మీద ఈసారి ఫుల్ ఫోకస్ పెడుతున్న బీజేపీకి అధికారంలో ఉన్న కర్నాటక చాలా ఇంపార్టెంట్. అందుకే మోడీ గత వారం నుంచి కర్నాటక మీదనే దృష్టి పెట్టేశారు. ఇక ఆరు నూరు అయినా కన్నడ సీమను కమలం చేజిక్కించుకోవాల్సిందే అన్నదే బీజేపీ పంతంగా ఉంది.

# అట్టహాసంగా బిఆర్ఎస్ సెంట్రల్ ఆఫీస్ ప్రారంభం







ఢిల్లీ: భారత రాష్ట్ర సమితి కేంద్ర కార్యాలయాన్ని ఆ పార్టీ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు దేశ రాజధానిలో ప్రారంభించారు. గురువారం ముందుగా నిర్ణయించుకున్న ముహూర్తానికి (1గం.05ని.) ఆయన ఆఫీస్ రిబ్బన్‌ను కట్ చేశారు. బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం ప్రారంభోత్సవానికి బీఆర్ఎస్ నేతలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. దీంతో వసంత్ విహార్ ప్రాంతంలో కోలాహలం నెలకొంది. ప్రారంభోత్సవం తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలతో మొదటి అంతస్తులోని తన కార్యాలయంలో కేసీఆర్ భేటీ అయ్యారు. మొత్తం 1,300 గజాల్లో ఉన్న స్థలంలో 20 వేల చదరపు అడుగుల ప్రాంతంలో భవనాన్ని నిర్మించారు. అందులో లోయర్ గ్రౌండ్, గ్రౌండ్, మొదటి, రెండవ, 3వ అంతస్తులతో కలిపి మొత్తం 5 అంతస్తులు న్నాయి. లోయర్ గ్రౌండ్‌లో మీడియా సమావేశాల ను నిర్వహించేందుకు వీలుగా మీడియా హాల్‌తోపాటు రెండు ఇతర గదులను నిర్మించారు. లోయర్ గ్రౌండ్‌లోకి వచ్చే మీడియాకు వీలుగా ఉండేలా ప్రత్యేక ఎంట్రెన్స్‌ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శుల కోసం నాలుగు గదులు, కార్యాలయ రిసెప్షన్, కార్యకర్త లు, నాయకుల కోసం క్యాంటీన్‌ను సిద్ధం చేశారు. మొదటి అంతస్తులో పార్టీ అధ్యక్షుడి చాంబర్, పేషీ, కాన్ఫరెన్స్ హాల్ ఉన్నాయి. 2,3 అంతస్తుల్లో ఢిల్లీలో పార్టీకి సంబంధించిన కార్యక్రమాలకు వచ్చే కార్యకర్తలు, నాయకులు బస చేసేందు కు 18 గదులతోపాటు రెండు ప్రత్యేక సూట్ రూమ్‌లను సిద్ధం చేశారు.

సూట్ రూమ్‌లలో పార్టీ అధ్యక్షుడు, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు బస చేస్తారు. ఢిల్లీలోని వసంత్ విహార్‌లో 2021 సెప్టెంబర్ 2న కేసీఆర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏడాదిలోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని భావించినప్పటికీ.. ఢిల్లీలో కాలుష్యం కారణంగా నిర్మాణ పనులపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. దీంతో అనుకున్న సమయానికి పూర్తి చేయలేకపోయారు.

## సంపాదకీయం

# 'ది కేరళ స్టోరీ'..

## అసలు వివాదం ఏంటి? నేతలు ఎందుకు స్పందిస్తున్నారు?

'కశ్మీర్ ఫైల్స్'.. కశ్మీర్ లోని పండింట్ల ఊచకోత ప్రధాన ఇతివృత్తంగా తెరకెక్కింది. బీజేపీ దీన్ని హైలెట్ చేసింది. ప్రచారం చేసుకుంది. ఇప్పుడు కేరళపై మరో కథ పడింది. కేరళ రాష్ట్రంలో తప్పిపోయిన అమ్మాయిలు వేలల్లో ఉన్నారు. దుబాయ్ షేక్‌లకు అమ్ముడుపోయిన వారి కేసులు.. ఇక లవ్ జిహాద్ పేరిట మతం మార్చుకున్న కేసులు ఇప్పటికీ పెండింగ్ లో ఉన్నాయి. అలాంటి ఇతివృత్తాన్ని తీసుకొని కేరళలో తప్పిపోయిన అమ్మాయిలనే కథనే 'ది కేరళ స్టోరీ'గా తీశారు. మరికొన్ని రోజుల్లోనే ఈ సినిమా విడుదల కానుంది. కానీ అప్పుడే ఈ సినిమాపై రాజకీయ పార్టీలు నేతలు విమర్శల వాన కురిపిస్తున్నారు. సినిమాపై వివాదం మొదలైంది. మే 5న విడుదలకు సిద్ధమైన ఈ చిత్రంపై కేరళలో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. మతసామరస్యాన్ని దెబ్బ తీసే ఇటువంటి సినిమాను విడుదల చేయవద్దంటూ అధికార పలు విపక్ష పార్టీలు మండిపడుతున్నాయి. తాజాగా ఈ సినిమాపై ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా ఘాటుగా స్పందించారు. రాష్ట్రాన్ని మత తీవ్రవాద కేంద్రంగాచిత్రీకరించే దుష్ప్రచారానికి ఉపక్రమిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి రాజకీయాలు కేరళలో పనిచేయవని స్పష్టం చేశారు. ఈ తరుణంలో అసలు 'ది కేరళ స్టోరీ' సినిమా ఏంటి? వివాదం ఏంటన్నది తెలుసుకుందాం..

**-'ది కేరళ స్టోరీ' కథేంటి? :** కేరళల్లో కొన్నేళ్లలో 32 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారు. వారి ఆచూకీ ఎక్కడనే ఇతివృత్తంతో ఈ కథను రూపొందించి సినిమా తీశారు. దర్శకుడు సుదీప్తోసేన్ 'ది కేరళ స్టోరీ' పేరుతో తీసిన ఈ సినిమాలో ఓ నలుగురు యువతులు మతం మారి ఉగ్రవాద శిక్షణ పొంది భారత్ తోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉగ్ర కార్యకలాపాల కోసం పనిచస్తున్నారనే కోణంలోనే చూపించడం వివాదానికి దారితీసింది. ఈ చిత్రానికి విపుల్ అమృత్ పాల్ షా నిర్మాతగా వ్యవహరించగా.. లీడ్ రోల్ లో ఆదాశర్మ నటించారు..

**-సినిమా కథపై వివాదం :** కేరళ రాష్ట్రానికి చెందిన 32000 మంది బాలికలు తప్పిపోయారని ఆ తర్వాత ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐఎస్లో చేరారని సినిమా ట్రైలర్లో చూపించారు. అదా శర్మ నటించిన కేరళ స్టోరీ ఈ వివాదానికి కేంద్రబిందువైంది. మే 5న సినిమా థియేటర్లలో విడుదల కానున్న ఈ చిత్రంపై కేరళ ప్రభుత్వం ప్రతిపక్ష కాంగ్రెస్ నుండి చాలా వ్యతిరేకత ఎదుర్కొంటోంది.. రాష్ట్రంలో సినిమా ప్రదర్శనను నిషేధించాలని నాయకులు పిలుపునిచ్చారు. దర్శకుడు నిర్మాత నటులు సినిమాకు మద్దతు ఇచ్చారు కేరళ కథ ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుంటుందని.. ముస్లింలను కాదు అని వివరిస్తున్నారు. మొత్తం చిత్రంలో కేరళ రాష్ట్రానికి వ్యతిరేకంగా ఏమీ లేదని భరోసానిస్తున్నారు. దర్శకుడు సుదీప్తో సేన్ మాట్లాడుతూ "నెలల పాటు పరిశోధన చేసి ఈ చిత్రాన్ని నిర్మించాను. నిర్మాతలెవరూ ఈ చిత్రాన్ని వెనకేసుకురాలేదు. నా దృక్పథం మారిపోయింది బాధితులతో మాట్లాడిన తర్వాత నేను చాలా చలించిపోయాను." అంటూ కథను మాత్రమే చూడాలని కోరారు. ఇక కేరళ సీఎం విజయన్ ఈ సినిమా కేరళలో మతవిద్వేషాలు రెచ్చగొట్టడానికి.. దేవాన్ని ప్రచారం చేసే ఉద్దేశంతోనే తీసినట్టుగా విమర్శించారు. ఈ చిత్రంను ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలు కూడా వ్యతిరేకించారు. రాష్ట్రంలో విడుదలకు అనుమతి ఇవ్వకూడదని కాంగ్రెస్ డీవైఎఫ్ఐ ఐయూఎంఎల్ వంటి పార్టీలు డిమాండ్ చేశాయి. 'సినిమాపై నిషేధం విధించాలని నేను కోరడం లేదు. భావవ్యక్తీకరణ స్వేచ్ఛను దుర్వినియోగం చేసినంత మాత్రాన అది విలువైనదిగా ఉండదు. అయితే ఇది మన వాస్తవికతను తప్పుగా చూపించడమేనని గట్టిగా స్పష్టంగా చెప్పే హక్కు కేరళీయులకు ఉంది.' అంటూ కేంద్రమాజీ మంత్రి శశిథరూర్ ట్వీట్ చేశారు. ది కేరళ స్టోరీ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ ఏప్రిల్ 26న విడుదలైంది. అనంతరం దీనిపై వివాదం మొదలైంది. చివరకు ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు అనుమతి రావడంతో మే 5న విడుదలకు సిద్ధమైంది.

# చెత్త సమస్యకు కొత్త పరిష్కారం



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 పురపాలక సంఘాల్లో పూర్తి స్థాయి డంపింగ్‌యార్డులు లేక చెత్త నిర్వహణ లక్ష్యం నెరవేరడం లేదు. కొన్ని చోట్ల చెత్త సేకరణకే ఇబ్బందులు పడుతున్నారు. పాత పురపాలక సంఘాల్లో పరిస్థితి కొంతమెరుగ్గా ఉన్నా.. కొత్తవాటిల్లో దయనీయ పరిస్థితి ఉంది. చాలా పురపాలక సంఘాల్లో రహదారుల పక్కన, ఖాళీ స్థలాల్లో చెత్త పారబోసి కాల్చి వేస్తున్నారు. దీంతో వాతావరణంలో కాలుష్యం ఏర్పడుతోంది. కొన్ని జిల్లా కేంద్రాల్లో నేటికి డంపింగ్‌యార్డుల పనులు పూర్తి కాకపోవడంతో సేంద్రియ ఎరువుల తయారీ నిలిచింది. నిత్యం పేరుకుపోతున్న చెత్తకు పరిష్కారం చూపేందుకు బయోమైనింగ్ విధానం అమలుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పురపాలికలకు ఇటీవలే ఉత్తర్వులు అందాయి.

అపరిష్కృతంగా ఉన్న సమస్యకు చెక్

పట్టణాల్లో డంపింగ్ యార్డుల ప్రక్షాళనలో భాగంగా ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఘనవ్యర్థాల సమస్య పరిష్కరించేందుకు బయోమైనింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు. ఇందులో భాగంగా భారీగా పేరుకుపోతున్న చెత్తను భూమి లోపల పాతిపెట్టేందుకు యంత్రాల సాయంతో పెద్దపెద్ద గుంతలు తీస్తారు. వీటిలో సేకరించిన చెత్తను పొరలు పొరలుగా పేర్చి అది కరిగిపోయేలా చేస్తారు. ఇలాచేస్తే భారీగా పేరుకుపోతున్న చెత్త సమస్య కొలిక్కిరానుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభత్వాల భాగస్వామ్యం..బల్దియాల్లో బయోమైనింగ్ ప్రక్రియ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలు చేయనున్నారు. లక్షకు పైగా జనాభా ఉన్న పట్టణాల్లో కేంద్రం వాటా 33 శాతం, రాష్ట్ర వాటా 67 శాతంతో నిధుల వ్యయం చేయనున్నారు. లక్షలోపు జనాభా ఉన్న పట్టణాల్లో కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు చెరి సగం ఖర్చు భరించనున్నాయి. 2011 గణాంకాల ప్రకారం ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల పురపాలికల్లో లక్షకు పైగా జనాభా ఉంది. ఇక్కడ మాత్రమే కేంద్రం వాటా 33 శాతం, రాష్ట్రం వాటా 67 శాతం భరించనున్నాయి. మిగతా 9 పట్టణాల్లో లక్షలోపు జనాభా ఉండగా అక్కడ చెరో 50 శాతం చొప్పున నిధులు భరించే అవకాశం ఉంది.

స్వచ్ఛభారత్ మిషన్ 2.0

స్వచ్ఛభారత్ మిషన్(అర్బన్) 2.0లో భాగంగా పురపాలికల్లో జీరో డంపింగ్ స్థలాల సాధనే లక్ష్యంగా బయోమైనింగ్ విధానాన్ని అవలంబించనున్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కాంపోనెంట్ కింద వీటికి నిధులు సమకూర్చనున్నారు. బయోమైనింగ్ కోసం టెండర్లు నిర్వహించి ఏజెన్సీలకు ఈ బాధ్యతలు అప్పజెప్పనున్నారు. ఒక మెట్రిక్ టన్ను చెత్త పాతిపెట్టేందుకు రూ.550 చొప్పున చెల్లించనున్నారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోతుండగా బయోమైనింగ్ ప్రక్రియకు రూ.5 కోట్లపైనే ఖర్చు చేయనున్నట్లు అంచనా..

ఉత్తర్వులు అందాయిఖాజా మోయిజోద్దిన్, పురపాలిక కమిషనర్, చెన్నూరుబయోమైనింగ్ ప్రక్రియ చేపట్టాలని ఇటీవలే ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు కసరత్తును ప్రారంభించాం. తదుపరి మార్గదర్శకాలకనుగుణంగా ముందుకు సాగుతాం.

# పల్లీ పండినా.. నష్టమే..!



చేగుంట : యాసంగిలో వరికి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని అధికారులు సూచించారు. ఈక్రమంలో కొందరు రైతులు స్పందించి వ్యవసాయాధికారుల సూచనల మేరకు వేరుసెనగ పంట సాగు చేశారు. దిగుబడి ఆశించిన మేర రావటంతో కర్షకులు సంతోషించారు. ప్రభుత్వ మద్దతు ధర ఉన్నా విక్రయించలేనియాసంగిలో వరికి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని అధికారులు సూచించారు. ఈక్రమంలో కొందరు రైతులు స్పందించి వ్యవసాయాధికారుల సూచనల మేరకు వేరుసెనగ పంట సాగు చేశారు. దిగుబడి ఆశించిన మేర రావటంతో కర్షకులు సంతోషించారు. ప్రభుత్వ మద్దతు ధర ఉన్నా విక్రయించలేని దుస్థితి నెలకొనడంతో దిగాలు చెందుతున్నారు. ప్రైవేటుగా అమ్ముకుంటే మద్దతు ధర ఇవ్వకపోవడంతో అన్నదాతలు నష్టపోతున్నారు. ఎక్కడ అమ్ముకోవాలోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో రెండు దశాబ్దాల క్రితం వేరుసెనగ భారీగా సాగు అయ్యేది. మంచి దిగుబడులు వస్తుండటంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు, లేదంటే నూనె పట్టించుకునేవారు. కాలక్రమంలో పంట సాగు పూర్తిగా తగ్గిపోయింది. రైతులు వరి, మొక్కజొన్న, శనగ సాగువైపు దృష్టి సారించడమే ఇందుకు కారణం. ప్రభుత్వం వరి వేయవద్దని పేర్కొంది. వేరుసెనగతో పాటు ఇతర అంతరపంటలను వేసుకుంటే అమ్ముకోవటానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా లాభసాటిగా ఉంటుందని భావించి సాగు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 3779 మంది రైతులు 3,645.18 ఎకరాల్లో సాగు చేశారు. తీరా పంట చేతికి వస్తున్న క్రమంలో కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేక.. బహిరంగ విపణిలో గిట్టుబాటు ధర లభించక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆశాజనకంగా దిగుబడి..జిల్లాలో ఎకరాకు ఎనిమిది క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. దీని ప్రకారం మొత్తంగా 29,164 క్వింటాళ్లు రానున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలు రూ.5,550 ఉంది. దీని ప్రకారం రైతులు విక్రయిస్తే ఎకరాకు రూ.44,400 వస్తుంది. ఈనేపథ్యంలో ప్రభుత్వం జిల్లాలో ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. దీన్ని ఆసరా చేసుకుని ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. క్వింటాలు రూ.4 వేలు చెల్లిస్తున్నారని రైతులకు చెబుతున్నారు. కనీసం నూనె పట్టించాలనుకున్నా ఫలితం ఉండదని వాపోతున్నారు.

అనుమతి రాగానే ఏర్పాటు చేస్తాం..పరశురాంనాయక్, డీఏవో

జిల్లాలో రెండు చోట్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. చాలా ఏళ్ల తర్వాత రైతులు ముందుకు వచ్చి వేరుసెనగ సాగు చేసుకున్నారు. వారికి నష్టం రాకుండా ఉండాలనే ఉద్దేశంతో కేంద్రాలను ఏర్పాటు కోరుతూ ప్రతిపాదనలు పంపాం. అనుమతి రాగానే కేంద్రాలను ప్రారంభించి.. రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటాం.

తక్కువ ధరకు అడుగుతున్నారుప్రవీణ్‌కుమార్, కర్నాల్‌పల్లి

నాలుగు ఎకరాల్లో పంట సాగు చేశా. ఇప్పటికే చేతికి వచ్చింది. ఎక్కడ విక్రయించాలో తెలియటం లేదు. మార్కెట్‌లో వ్యాపారులు తక్కువ ధర ఇస్తామంటున్నారు. క్వింటాలు రూ.4 వేలకు కొంటున్నారు. దీనివల్ల కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే మేలు కలుగుతుంది.

మొదటిసారి వేశా..ఎల్లం, బోనాల

వేరుసెనగ మొదటి సారి సాగు చేపట్టా. దిగుబడి బాగానే వచ్చినా గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నాం. ప్రభుత్వం తమలాంటి రైతుల గురించి ఆలోచించడం లేదు. వేరుసెనగ వేసుకోవాలని ప్రోత్సహించిన అధికారులు ఇప్పుడు ఏమాత్రం పట్టించుకోవటం లేదు.

# టీఎస్ఐఐసీ పరిధిలోకి పారిశ్రామిక వాడలు!

జిన్నారం : ఇప్పటివరకు పలు పంచాయతీల పరిధిలో ఉన్న పారిశ్రామిక వాడలు ఇకనుంచి ఐలా ఆధీనంలో పని చేయనున్నట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి. టీఎస్ఐఐసీ పరిధిలోకి వెళ్లనుండటంతో ఐలా(ఇండస్ట్రీయల్ లోకల్ అసోసియేషన్) ఆధ్వర్యంలో పన్నులు వసూలు చేయడంతో పాటు ప్రగతి కార్యక్రమాలు నిర్వహించనుంది. ఇప్పటికే నోటిఫికేషన్ రాగా పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించారు. కాగా ఎప్పటి నుంచి అమలు చేయున్నారనేది ఇంకా స్పష్టత లేదని, పంచాయతీ రాజ్ శాఖ ఉత్తర్వులు ఇచ్చిన మాట వాస్తవమేనని పేర్కొంటున్నారు. దీంతో పంచాయతీలకు వచ్చే ఆదాయం 70 శాతం కోత పడనుంది. ఐలా పరిధిలోకి వెళ్లే వాడలు...జిన్నారం మండలం గడ్డపోతారం పంచాయతీ అల్లీనగర్, శివానగర్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసే ఎల్ఈడీ పరిశ్రమల పార్కు, అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్ పరిధి మెడికల్ డివైజ్ పార్కు, పటాన్‌చెరు మండలం చిట్కుల్, హత్నూర మండలం బోర్పట్ల, ముచ్చర్ల, పల్పనూర్, కోహిర్ మండలం దిగ్వాల్ పారిశ్రామిక వాడలు ఐలా పరిధిలోకి వెళ్లనున్నాయి. ఈ మేరకు ఆయా పంచాయతీల నోటీసు బోర్డుల్లో ప్రభుత్వ ప్రకటనను ప్రదర్శించారు. ఆయా పారిశ్రామికవాడలపై పంచాయతీలకు ఉన్న అధికారాన్ని బదలాయిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో వీటిపై పంచాయతీల అభిప్రాయం కోరగా అవి వ్యతిరేకించాయి. ఆయా చోట్ల పారిశ్రామిక వాడల్లో మౌలిక వసతుల కల్పనపై పాలకవర్గాలు పెద్దగా దృష్టి సారించకపోవటంతో యాజమాన్యాలు పలు విజ్ఞాపనలు చేశాయి. దీంతో ప్రభుత్వమే అధికారాలు బదలాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. తుది ప్రకటన రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

ఇక 30 శాతమే ఆదాయం..టీఎస్ఐఐసీ పరిధిలో ఉండే ఐలా నేరుగా పరిశ్రమల నుంచి పన్నులు వసూలు చేస్తుంది. వచ్చే ఆదాయంలో 30 శాతం పంచాయతీలకు విడుదల చేస్తుంది. రహదారులు, మురుగుకాలువలు వంటి ప్రతి సమస్యను ఐలానే పరిష్కరిస్తుంది. ఒక రకంగా ఆయా పారిశ్రామిక వాడల్లో కొత్త నిర్మాణాలు చేసినా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా పంచాయతీలకు ఎటువంటి అధికారం ఉండదు. ఐలా(పారిశ్రామిక వేత్తల సంక్షేమ సంఘం) ఎన్నికలు అధికారికంగా నిర్వహించి సంబంధిత పాలకవర్గం ఆధ్వర్యంలోనే పనులు చేస్తారు.

# ఆగిన పనులు.. తప్పని కష్టాలు!

గజ్వేల్: మల్లన్నసాగర్ భూనిర్వాసితుల (ఆర్అండ్ఆర్) కాలనీలో అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అంతర్గత మురుగు కాల్వలు చాలా చోట్ల ధ్వంసమయ్యాయి. వర్షాకాలం నేపథ్యంలో నీరు ఇళ్లలోకి వచ్చే ప్రమాదముంది. ప్రధాన రహదారుల మధ్య నిర్మించిన విభాగినుల్లో ఏర్పాటు చేసేందుకు తీసుకొచ్చిన స్తంభాలు బిగించలేదు. దీంతో రాత్రిపూట ప్రధాన రహదారుల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బల్దియా పరిధిలోని సంగాపూర్-ముట్రాజ్‌పల్లిలో నిర్మించిన కాలనీలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మల్లన్నసాగర్ జలాశయం పూర్తి చేసి గోదావరి జలాలను తీసుకురావటంలో ప్రభుత్వం చూపిన శ్రద్ధ తమకు సదుపాయాలు కల్పించటంలో ఆసక్తి చూపడం లేదని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. పది వేల మందికిపైగా..మల్లన్నసాగర్ నిర్మాణంతో తొగుట మండలం పల్లెపహాడ్, వేములఘాట్, ఏటిగడ్డకిష్టాపూర్, కొండపాక మండలం సింగారం, ఎర్రవల్లి తదితర గ్రామాల ప్రజలకు ప్రభుత్వం అతిపెద్ద కాలనీ నిర్మించింది. 600 ఎకరాల భూమి సేకరించిన సర్కారు దాదాపు 2500 ఇళ్లు నిర్మించి నిర్వాసిత కుటుంబాలకు కేటాయించింది. ఇక్కడ దాదాపు పది వేల మంది నివసిస్తున్నారు. ఇప్పటికీ ప్రధాన రహదారుల్లో అక్కడక్కడా సీసీ నిర్మాణాలు పూర్తి చేయలేదు. వర్షం కురిసిన సందర్భంలో నీరు వెళ్లేందుకు అనువుగా కాలువలు లేకపోవటంతో మడుగులు కడుతున్నాయి. ఇళ్లకు నీటిని సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా రూ.5.40 కోట్లతో ఆరు చోట్ల నిర్మిస్తున్న ట్యాంకుల నిర్మాణ పనులు ఆలస్యంగా సాగుతున్నాయన్న విమర్శలున్నాయి. మరోవైపు కాలనీలో నాలుగు పీహెచ్‌సీలు, నాలుగు అంగన్వాడీ కేంద్రాలు నిర్మించి నెలలు గడుస్తున్నా... వాటికి తలుపులు, కిటికీలను బిగించలేదు. ఎప్పుడు అందుబాటులోకి తీసుకొస్తారోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు. వైకుంఠధామం నిర్మించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఇళ్ల సమీపాన లోతట్టు ప్రాంతంలో దహనసంస్కారాలు నిర్వహిస్తుండటంతో ఇళ్లలోకి పొగ చేరి నానా అగచాట్లు పడుతున్నారు.

వేగవంతం చేయిస్తాం..: - ముత్యంరెడ్డి, గడా ఓఎస్‌డీ

మిగిలిపోయిన పనులను వేగవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం. అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాలలు, పీహెచ్‌సీల నిర్మాణాలు తదిదశలో ఉన్నాయి. కొత్త విద్యాసంవత్సరంలో అందుబాటులోకి తీసుకొస్తాం. ట్యాంకుల నిర్మాణం, మురుగు కాల్వల మరమ్మతు పనులు త్వరలో చేపడతాం.

# జలం.. ఒడిసి పడితే ఫలం

సంగారెడ్డి : వర్షపు నీటిని ఒడిసిపట్టి భూమిలోకి ఇంకించేందుకు జిల్లా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఊరూరా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు.. ఇతర జల సంరక్షణ పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. భూగర్భ జలాలు పెంచేలా చేపట్టిన పనులు సత్ఫలితాలను ఇస్తున్నాయి. జల వనరుల్లో నీటి మట్టాలు పెరగడంతో పాటు.. బోరుబావులు ఆశాజనకంగా నీరందిస్తున్నాయి. భవిష్యత్ తరాలకు తాగు, సాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా, పశు పక్ష్యాదుల దాహార్తి తీర్చేలా బాటలు వేస్తున్నారు. జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలశక్తి అభియాన్ పనులకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న తీరు, చేపట్టిన పనులపై కథనం.రెండో దశలోనూ గుర్తింపు సాధించేలా..జిల్లాలో తొలి దశ జలశక్తి అభియాన్ పథకంలో కల్హేర్, పటాన్‌చెరు, న్యాల్‌కల్, జహీరాబాద్, ఝరాసంగం, అమీన్‌పూర్ మండలాలను ఎంపి చేసి.. అమలు చేశారు. ఇక్కడి చేపట్టిన పనులు విజయవంతం కావడంతో.. రెండేళ్ల క్రితం జాతీయ స్థాయిలో ప్రథమస్థానం దక్కింది. రెండో దశకు గత మార్చి 29న రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ దేశవ్యాప్తంగా శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి జిల్లాలోని అన్ని మండలాల్లోనూ జలశక్తి అభియాన్ అమలవుతుంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలతో ఈ జల సంరక్షణ పనులు చేయిస్తున్నారు. రైతులకు ఎలాంటి ఖర్చు లేకుండా.. వారి అభీష్టం మేరకు పంట కాల్వలు సైతం బాగు చేయించుకునేలా చర్యలు చేపట్టారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో... ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణలో భాగస్వాములవుతున్నారు.

గుట్టలపై కందకాలుగుట్టలు, లోతైన ప్రాంతాల్లో పొడవాటి గుంతలు, కందకాలు తవ్వుతారు. ఇవి మూడు రకాలుగా ఉంటాయి. రైతుల పొలాల్లోనూ కందకాలు ఏర్పాటు చేసేలా అవకాశం కల్పించారు. రైతుకు ఎంత పొలం ఉందో నిర్ధారించి.. పొలం చుట్టూ నిర్దేశించిన లోతు వెడల్పు వరక గుంతలు తవ్వుతారు. నీటి కట్టపై హరిత హారంలో భాగంగా కూలీలు మొక్కలు నాటుతున్నారు. జహీరాబాద్, మొగుడంపల్లి, మునిపల్లి, కోహీర్, ఝరాసంగం, రాయికోడ్, కల్హేర్ రైతులు వీటిపై ఆసక్తి చూపుతున్నారు. ఈ ప్రాంతంలో అత్యధికంగా గుట్టలు ఉండటం వల్ల వర్షాధార పంటలు వేస్తుంటారు. దీంతో రైతులు ముందుకు వస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

పొలాల్లో నీటి కుంటలు

రైతుల సాగు భూముల్లో.. వారి అనుమతితో నీటి కుంటల నిర్మాణాలు చేపడుతున్నారు. మొదటి రకంలో.. 20 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పుతో మూడు మీటర్ల లోతు వరకు మట్టి తీస్తారు. రెండో రకంలో 12 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో 2 మీటర్ల లోతు వరకు మట్టి తీస్తున్నారు. వర్షపు నీరు నేరుగా ఆ కుంటలోకి చేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వీటి వల్ల భూగర్భ జలాలు పెరిగి బోర్లు సమృద్ధిగా నీరందిస్తున్నాయి. పశువుల దాహార్తి తీర్చు కోవచ్చు.. సాగు అవసరాలకు వినియోగించుకుంటున్నారు. జిల్లాలో అత్యధికంగా న్యాల్‌కల్, కోహీర్, కల్హేర్, ఝరాసంఘం, జహీరాబాద్, మొగుడంపల్లి రైతులు వీటి ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు.

ఇంటింటా ఇంకుడు గుంతలు గ్రామీణ ప్రాంతవాసులై ఉండి.. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కల్గిన వారికి ఇంకుడు గుంతలు తవ్వుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఇల్లు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, బోరుబావుల సమీపంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేసే గ్రామాల్లో ఇంకుడు గుంతలు తవ్వుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. నిధులు నేరుగా సంబంధిత లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమవుతాయి. ఇంటి వద్ద తవ్వుకుంటే రూ. 4300, సామాజిక గుంతకు రూ.12వేలు మంజూరు చేస్తారు. ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుంది. దీంతో పాటు.. జిల్లాలో చెరువులు, కుంటల్లో పూడిక తీసేందుకు ఉపాధి హామీ కూలీలు శ్రమిస్తున్నారు. ఆయా నీటి వనరుల ఆధారంగా పనులు చేపట్టి పూడిక మట్టితో కట్టలను బలోపేతం చేస్తున్నారు.రైతులు సద్వినియోగం చేసుకోవాలి: రాజు, ఏపీడీ, జలశక్తి అభియాన్జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా.. జలశక్తి అభియాన్ ద్వారా ఉచితంగా జల సంరక్షణ పనులు చేపడుతున్నాం.

# తొలి విడత.. పనులు నత్తనడక

ఆసిఫాబాద్ : ప్రైవేటుకు దీటుగా సర్కారు బడుల్లో మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'మన ఊరు- మన బడి' పథకానికి శ్రీకారం చుట్టింది. పనుల గుర్తింపు, అనుమతుల్లో జాప్యంతో ఆశించిన స్థాయిలో కార్యక్రమం ముందుకు సాగడంలేదు. ఆరు రోజుల్లోనే బడులు పునఃప్రారంభం కానున్నాయి. కానీ తొలి విడతలో ఎంపికైన పాఠశాలల్లో కేవలం 30 శాతం బడుల్లోనే అభివృద్ధి పనులు మొదలుకావడం గమనార్హం. వానలు మొదలైనా.. పాఠశాలలు తెరిచినా నిర్మాణ, మరమ్మతులు పనులు చేపట్టడం కష్టమే. 'మన ఊరు- మన బడి' పనులపై పరిశీలన చేపట్టింది. వివరాలిలా ఉన్నాయి..జిల్లాలోని 735 ప్రభుత్వ విద్యాలయాలున్నాయి. వాటి పరిధిలో సుమారు 40 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రతి పాఠశాలలో విద్యుత్తు, వంట గది, డైనింగ్‌హాల్, ప్రహారీ, మరుగు, మూత్రశాలలు, తాగునీరు, ఫర్నీచర్, సైన్స్ ల్యాబ్, డిజిటల్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, పెయింటింగ్ తదితర 12 రకాల వసతులు ఉండేలా 'మన ఊరు- మన బడి' కార్యక్రమం రూపొందించారు. మొదటి విడతలో 251 పాఠశాలలను ఎంపిక చేశారు. వివిధ ఇంజినీరింగ్ విభాగాలకు బాధ్యత అప్పగించారు. కానీ ఇప్పటి వరకు కేవలం 87 పాఠశాలల్లోనే పనులు మొదలయ్యాయి. దీంతో ఈసారి కూడా విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికే పరిస్థితులు కనిపిస్తున్నాయి.



ఇప్పటికీ జిల్లాకు రూ.2.16 కోట్ల నిధులు మంజూరు కాగా పనులు చేపట్టేందుకు ముందస్తుగా 150 పాఠశాలల ఖాతాల్లో జమ చేశారు. ప్రతిపాదనలు చేసినా..బెజ్జూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరింది. స్లాబు పైకప్పు దెబ్బతిని వర్షాకాలంలో నీరు తరగతి గదుల్లోకి చేరుతోంది. 193 మంది విద్యార్థులున్న పాఠశాలలో రూ.10.17 లక్షల అంచానాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పనులు ఇప్పటి వరకు మొదలుకాలేదు.

వర్షం పడితే సెలవు అనివార్యం..కాగజ్‌నగర్(గ్రామీణం: ఇది కాగజ్‌నగర్ మండలంలోని విలేజి నం.11లోని ప్రాథమిక పాఠశాల భవనం. ఇందులో 34 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఒకే ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. ఆరేళ్ల కిందట ఈదురుగాలులకు పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ ప్రత్యామ్నాయ వసతి లేక ఇందులోనే విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువుకుంటున్నారు. వర్షాలు పడిన రోజుల్లో పాఠశాలకు ఆకస్మిక సెలవు ప్రకటించడం అనివార్యమవుతోంది. 'మన ఊరు- మన బడి' తొలి విడత జాబితాలో ఎంపికైనప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టలేదు.నిధులున్నా.. మరమ్మతుల జాడేది..?ఇది జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల. ఇక్కడ 466 మంది విద్యార్థులు చదువుతున్నారు. 11 తరగతి గదుల్లో రెండు చిన్నపాటి వర్షానికే ఊరుస్తున్నాయి. స్లాబు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. వివిధ మరమ్మతుల కోసం రూ.29 లక్షలతో ప్రతిపాదనలకు అనుమతి లభించినా ఇప్పటి వరకు పనులు మొదలు కాలేదు. ఇలా మండలంలో 32 పాఠశాలలు ఎంపిక కాగా ఇప్పటి వరకు పనులు మొదలు కాలేదు.పూర్తి కాకుంటే ప్రమాదమే..!ఇది వాంకిడి మండలం ఆర్లి ప్రాథమిక పాఠశాల. విద్యుత్తు, తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణం, చిన్నచిన్న మరమ్మతుల కోసం రూ.5.46 లక్షలతో అంచనాలు రూపొందించారు. విద్యుత్తు పనులు పూర్తి చేశారు. నీటిసంపు కోసం గోతి తవ్వారు. మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. మరో వారంరోజుల్లో పనులు పూర్తికావడం కష్టమే. పిల్లలు బడికి వచ్చేలోపు పనులు కాకుంటే ప్రమాదం పొంచి ఉంది.

వివరాలు ఇలా.. జిల్లాలో మొదటి విడతలో ఎంపికైన బడులు: 251 పనుల అంచనాలు తయారు చేసినవి: 247 అంచనా వ్యయం: రూ. 28.27 కోట్లు సాంకేతిక అనుమతి పొందిన పాఠశాలలు: 220 ఇప్పటి వరకు పనులు మొదలైనవి: 87 కేటాయించిన నిధులు: రూ. 2.16 కోట్లు

# 'ప్రగతి' పనులకు జేసీబీల కొరత

భైంసా :జిల్లాలో జేసీబీ యంత్రాలకు అనూహ్యంగా డిమాండ్ పెరిగింది. ప్రభుత్వం నిర్వహిస్తున్న పట్టణ, పల్లె ప్రగతి కార్యక్రమాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ఒకే సమయంలో ఊపందుకోవడంతో యంత్రాల వినియోగం ఎక్కువైంది. దీంతో ఇతర పనులకు జేసీబీ యంత్రాల కొరత ఏర్పడింది. ముఖ్యంగా బల్దియాలో నాలుగు రోజులుగా యంత్రాల అద్దె విషయంలో బల్దియా అధికారులకు, యంత్ర యజమానులకు పేచీ నెలకొంది.

ఒక్కటైన యజమానులు

పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా పెద్ద నాలాల్లో పూడికతీత, మురుగు తొలగింపు, ఖాళీ ప్లాట్లను శుభ్రపర్చి చదును చేయడం వంటి పనులకు జేసీబీ యంత్రాల అవసరం ఉంది. ఇందుకోసం బల్దియా అధికారులు యంత్ర వినియోగానికి గంటకు రూ.1,200 చొప్పున లెక్కలు వేసి 15 రోజుల పాటు పనులు చేసేందుకు రూ.20 లక్షల బడ్జెట్‌ను వెచ్చించి టెండరు పిలిచారు. జేసీబీ యంత్రాలను సరఫరా చేసేందుకు ఓ గుత్తేదారు టెండరు దక్కించుకున్నారు. అయితే జేసీబీ యజమానులంతా ఒక్కటై ఆ గుత్తేదారుకు తాము యంత్రాలను సరఫరా చేయలేమన్నారు. డీజిల్ ధరలు పెరిగాయని, ఆపరేటర్‌కు బత్తా ఇవ్వాల్సి ఉంటుందని, గంటకు దాదాపు రూ.1300లకు పైగా అవుతుందని, బల్దియా అధికారులు చెల్లించే ధరతో తమకు ఏమాత్రం గిట్టుబాటు కాదని తేల్చి చెప్పారు. దీంతో పట్టణ ప్రగతి కార్యక్రమం మొదలై నాలుగురోజులైనా వార్డుల్లో ఎక్కడా జేసీబీలు కనిపించలేదు. ఈ విషయం తెలియని పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లో పనులకు జేసీబీలు కావాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు.

ఎమ్మెల్యే చొరవతో పరిష్కారంపట్టణ ప్రగతి కార్యక్రమానికి యంత్ర యజమానులు జేసీబీలను పెట్టకపోవడంతో బల్దియా యంత్రాంగం ఆందోళనలో పడింది. అధికారులు పలుమార్లు చర్చలు జరిపినా యజమానులు వినకపోవడంతో విషయం ఎమ్మెల్యే జోగు రామన్న వరకు వెళ్లింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పట్టణ ప్రగతి కార్యక్రమానికి జేసీబీలు పెట్టకపోవడంపై ఎమ్మెల్యే జోగు రామన్న సీరియస్ అయినట్లు సమాచారం. జేసీబీ యజమానుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బైన్‌వార్ గంగారెడ్డిని పిలిచి మాట్లాడడంతో ఎట్టకేలకు వివాదం సద్దుమణిగింది దాదాపు 10 జేసీబీలు ఆయా వార్డుల్లో పనులకు వెళ్లాయి. 49 వార్డుల్లో ఒక్కో రోజు ఒక్కో వార్డులో పనిచేసేలా బల్దియా అధికారులు సర్దుబాటు చేస్తున్నారు.

# త్వరపడి.. బాగుచేయాలి బడి




ఆసిఫాబాద్ :ఇంద్రవెల్లి మండలం హర్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో పైకప్పు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. రూ.25.50 లక్షల అంచనాతో ప్రతిపాదనలు తయారుచేయగా.. పనులు కొనసాగుతున్నాయి. సర్కారు బడుల రూపురేఖలు మార్చేదిశగా అమలు చేస్తున్న 'మన ఊరు - మన బడి' కార్యక్రమ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 237 పాఠశాలలు ఎంపికకాగా.. కేవలం 87 పాఠశాలల్లోనే పనులు ప్రారంభం కావడం ఇందుకు నిదర్శనం. వీటిపై 'న్యూస్‌టుడే' బృందం మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపింది. పాఠశాలల పునఃప్రారంభానికి ఇంకా అయిదురోజులే మిగిలి ఉండగా.. ఆయా పనులు పూర్తవడం అనుమానమే.

తొలివిడతగా జిల్లాలో 237 పాఠశాలలను ఈ పథకం కింద ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇందులో 142 ప్రాథమిక, 38 ప్రాథమికోన్నత, 57 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ) ఆధ్వర్యంలో రూ.30 లక్షల లోపు పనులను చేయాల్సి ఉండగా.. ఆపై నిధులకు టెండర్లు పిలవాల్సి ఉంది. ఎస్ఎంసీలతో చేపట్టే పనుల్లో 87 పాఠశాలల్లో విద్యుదీకరణ, మరమ్మతులు, టాయిలెట్, తాగునీటి సౌకర్యం, ప్రహరీ నిర్మాణాలను చేపట్టాల్సి ఉండగా.. ఇపుడిపుడే పనులు మొదలయ్యాయి.

రూ.77.57 లక్షలు జమ

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం మండలానికి రెండు పాఠశాలల చొప్పున ఎంపికైన 34 పాఠశాలల్లో అన్ని పనులు పూర్తి చేసి నమూనాగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ఆ పాఠశాలలతోపాటు మొత్తం 87 పాఠశాలలకు 10 శాతం నిధులను రూ.77.57 లక్షలు ఎస్ఎంసీ ఖాతాల్లో జమ చేశారు. అయినా పనుల ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. మరికొన్ని చోట్ల చేసిన పనులకు డబ్బులు వస్తాయో రావోనని కమిటీలు ముందుకు రావడం లేదని హెచ్ఎంలు చెబుతున్నారు.

సంపు పనులు పూర్తి!

జైనథ్ ప్రాథమిక పాఠశాలకు 'మన ఊరు.. మన బడి' కింద రూ.8.20లక్షలు మంజూరుకాగా.. ప్రస్తుతం తాగునీటి సంపు పనులు పూర్తయ్యాయి. విద్యుత్తు సౌకర్యం, భవన లీకేజీ మరమ్మతులు కొనసాగుతున్నాయి.

# భవిష్య నిధిపై పన్ను పోటు



ఆసిఫాబాద్ : మలి వయస్సులో సామాజిక భద్రత కింద ఉపయోగపడే భవిష్య నిధిపై ఈ ఆర్థిక సంవత్సరం నుంచి పన్ను విధించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి వరకు ఉద్యోగ విరమణానంతరం పీఎఫ్‌పై లభించే మొత్తంపై పన్ను మినహాయింపు ఉండేది. భవిష్యనిధిపై ప్రభుత్వం పన్ను విధించనుందని తెలియడంతో సింగరేణి ఉద్యోగుల్లో కలవరం మొదలైంది. కేంద్ర ప్రభుత్వం మాత్రం అధిక ఆదాయ వర్గాలకు మాత్రమే పన్ను వర్తిస్తుందని ప్రకటించింది.

ఇప్పటి వరకు నిల్వ ఉన్న సొమ్ముకు మినహాయింపు

కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు నిల్వ ఉన్న ఖాతాలపై కరుణ చూపింది. 2021 మార్చి 31లోపు నిల్వ ఉన్న పీఎఫ్ సొమ్ముపై ఎలాంటి పన్ను విధించరు. ఏటా రూ. 2.5 లక్షలకు మించి జమ అయ్యే వారికి కొత్తగా తెరువనున్న ఖాతాలపై మాత్రమే పన్ను భారం పడనుంది. సింగరేణితోపాటు, కోల్ ఇండియా పరిధిలో పని చేసే దాదాపు 3 లక్షల మందిలో దాదాపు లక్షన్నర మందికి పైగా కేంద్రం విధించిన పరిమితికి మించి పన్ను జమ చేస్తున్నారని అంచనా. దేశంలోని బొగ్గు పరిశ్రమ మొత్తానికి భవిష్య నిధిని సీఎంపీఎఫ్ ట్రస్టు నిర్వహిస్తోంది. దీని కోసం బొగ్గు పరిశ్రమల యాజమాన్యాలు 4 శాతం చొప్పున నిర్వహణ వ్యయాన్ని భరిస్తున్నాయి. ఇప్పుడు రెండు ఖాతాలను నిర్వహించాలంటే పీఎఫ్ ట్రస్టుపై మరింత భారం పడనుందని అంచనా. ఇంతకాలం పన్ను మినహాయింపు లభిస్తుందనే ఉద్దేశంతో ఎక్కువ శాతం ఉద్యోగులు స్వచ్ఛందంగా పీఎఫ్ ఖాతాలో సొమ్ము జమ చేసుకుంటున్నారు. సీఎంపీఎఫ్ నిబంధనల ప్రకారం ఉద్యోగుల వాటా కింద వేతనం నుంచి 12 శాతం చొప్పున ఖాతాలో జమ చేస్తారు. అంతే మొత్తాన్ని కలిపి యాజమాన్యం తన వాటా కింద పీఎఫ్ ఖాతాలో జమ చేస్తోంది. ఉద్యోగులూ తమకు నచ్చిన విధంగా అదనంగా స్వచ్ఛంద భాగస్వామ్యం కింద 12 శాతం లోపు సొమ్మును జమ చేసుకునే వెసులుబాటు ఉంది. పీఎఫ్ ఖాతాపై ప్రస్తుతం 8.1 శాతం వడ్డీ లభించనుండగా, ఇంతకు ముందు 8.5 శాతం ఆపైన వడ్డీ లభించిన సందర్భాలు ఉండటంతో ఉద్యోగులు స్వచ్ఛంద భాగస్వామ్య వాటాకు మొగ్గు చూపారు. ఇప్పటికే 30 శాతం పన్ను పరిధిలో ఉన్న వారంతా స్వచ్ఛందంగా పీఎఫ్ ఖాతాలో సొమ్ము జమ చేసుకుంటూ, ఎంతో కొంత పన్ను మినహాయింపు పొందుతున్నారు. ఇప్పుడు 24 శాతం కోత పడే ఉద్యోగులంతా స్వచ్ఛంద భాగస్వామ్యాన్ని రద్దు చేసుకునే అవకాశం ఉంది.

అంతా ఆన్‌లైన్‌లోనే..సీఎంపీఎఫ్ ట్రస్టు బోర్డు నిర్వహించే పన్ను విధించే ఖాతాలో జమ అయ్యే సొమ్ముపై లభించే 8.1 శాతం వడ్డీపై ఆదాయపు పన్ను ఆన్‌లైన్‌లోనే కోత పడుతుంది. ఉద్యోగులు ఈ మొత్తాన్ని వార్షిక ఆదాయపు పన్ను చెల్లింపు సందర్భంగా లెక్కల్లో చూపించి పన్ను మినహాయింపు పొందే వెసులుబాటు ఉంటుందని చెబుతున్నప్పటికీ, గరిష్ఠ మినహాయిపు పరిధి దాటినవారికి పెద్దగా ఉపయోగం ఉండదు. 30 శాతం పన్ను చెల్లించే అధికాదాయ ఉద్యోగులకు పన్ను ప్రయోజనాలు పెద్దగా వర్తించవు. కేంద్ర నిర్ణయంపై కార్మిక సంఘాలు ఇప్పటి వరకు స్పందించలేదు. కార్మికులు మాత్రం ఆందోళన చెందుతున్నారు. బొగ్గు గనుల్లో కష్టించి పనిచేసే ఉద్యోగులకు పన్ను విధించడం సమంజసం కాదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

పరిమితి మించిన ఖాతాలకే పన్ను

నిర్దేశిత పరిమితిని మించిన పీఎఫ్ నిధులపై పన్ను విధించబోతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ సమయంలో ప్రకటించిన విషయం విదితమే. కొంత మంది ప్రపరిమితి మించిన ఖాతాలకే పన్ను నిధులను పీఎఫ్‌లో జమ చేస్తున్నారని, వారికి వడ్డీతోపాటు, ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు వర్తించడం సరైంది కాదని కేంద్ర ఆర్థిక మంత్రి అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి (సీబీడీటీ) 1962 నాటి ఆదాయపు పన్ను నిబంధనల్లో మార్పులు చేసింది. భవిష్య నిధి (పీఎఫ్)పై పన్నులను గణించేందుకు ప్రస్తుత పీఎఫ్ ఖాతాను రెండుగా విభజిస్తారు. ఈ రెండింటిలో ఒకటి పన్ను మినహాయించే ఖాతా, మరొకటి పన్ను విధించే ఖాతా నిర్వహించాలని ఆదాయపు పన్ను సవరణ 25వ సవరణలో పేర్కొన్నారు. తాజా సవరణ ప్రకారం పన్ను వర్తించే రెండో పీఎఫ్ ఖాతాలో జమ అయ్యే సొమ్ముపై వచ్చే వడ్డీపై పన్ను విధించనున్నారు. ఏడాదికి రూ. 2.5 లక్షలకు మించి పీఎఫ్ ఖాతాలో జమ అయ్యే ఉద్యోగులకు రెండు పీఎఫ్ ఖాతాలు ఉంటాయి. మొదటి ఖాతాలో రూ. 2.5 లక్షల వరకు జమ అవుతుంది. అంతకు మించిన సొమ్ము రెండో ఖాతాలో జమ చేసి, దానిపై వచ్చే వడ్డీపై పన్ను విధించడంతోపాటు, ఉపసంహరణ సమయంలో వచ్చే మొత్తంపైనా పన్ను పోటు పడనుంది.

# 'అదనం'.. అందని దైన్యం

భైంసా :వ్యవసాయంలో ఎదురయ్యే ఆటుపోట్లను, కష్టనష్టాలను తట్టుకుని ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కొందరు రైతులు వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడుతున్నారు. వాటితో అదనపు ఆదాయం, ఉపాధి పొందుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది రైతులు పాడిపడిశ్రమపై ఆధారపడుతున్నారు. వారిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొన్నేళ్ల నుంచి ఐకేపీ ఆధ్వర్యంలో డెయిరీలను నెలకొల్పి పాలసేకరణ చేసి నిర్ణీత ధరతో ప్రతి నెలా డబ్బులు చెల్లించేది. లీటరుకు రూ.4 చొప్పున అదనపు ప్రోత్సాహకం ఇచ్చి తోడ్పాటు అందించింది. అయితే గత నాలుగేళ్ల నుంచి అది చెల్లించడం లేదు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,323 మంది పాడి రైతులకు రూ.60 లక్షల బకాయిలు పేరుకున్నాయి.

సంస్థ మారినా..

గత ఏడాది క్రితం వరకు ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, భైంసా, కడెం, ఆదిలాబాద్, లక్షెట్టిపేట, బేల బీఎంసీలు(డెయిరీ) ఐకేపీ (ఇందిర క్రాంతి పథం) డెయిరీలుగా స్థానిక మండల సమాఖ్యలు నిర్వహించేవి. వాటిని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్లు పర్యవేక్షించేవారు. తదనంతర మార్పుల్లో భాగంగా 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రభుత్వం వాటిని విజయ డెయిరీ సంస్థకు అప్పగించింది. వాటితోపాటు విజయడెయిరీ ఆసిఫాబాద్‌లో కొత్తగా బీఎంసీ(బల్క్‌మిల్క్ కలెక్షన్ సెంటర్) నెలకొల్పింది. 2018-19 నుంచి 2020-21 వరకు పాత ఐకేపీ బీఎంసీ పరిధిలోని రైతులకు మూడేళ్ల ప్రోత్సాహకం సొమ్ము రూ.24 లక్షలు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇందులో ప్రధానంగా నిర్మల్ జిల్లాలోని మూడు డెయిరీలలోనే రూ.15 లక్షలు చెల్లించాల్సి ఉండటం గమనార్హం. తదనంతరం 2021-22 నుంచి ఇప్పటి వరకు 14 నెలలకు సంబంధించిన ఉమ్మడి జిల్లాలోని 7 బీఎంసీల రైతులకు ప్రోత్సాహక బకాయిలు రూ.35.47లక్షలు పేరుకుపోయాయి.

మండల సమాఖ్య/డీఆర్డీవోల వద్ద..

2018-19 నుంచి 2020-21 మూడేళ్ల పాడి ప్రోత్సాహక సొమ్ము బకాయిలు స్థానిక ఐకేపీ మండల సమాఖ్య/ఆర్డీఏల వద్ద జమ ఉన్నట్లు తెలుస్తోంది. విజయ డెయిరీకి మారిన అనంతరం సైతం ప్రభుత్వం ఎప్పటికప్పుడు తాజా ప్రోత్సాహకం రైతులకు ప్రతి నెలా చెల్లించకపోవడంతో అదే సాకుగా తీసుకున్న ఐకేపీ మండల సమాఖ్యలు, డీఆర్డీఏ అధికారులు పాత బకాయిలు చెల్లించకుండా చేతులు దులిపేసుకున్నట్లు సమాచారం.

డీఆర్డీఏ పీడీల దృష్టికి తీసుకెళ్లాం

మధుసూదన్‌రావు, మేనేజర్, ఉమ్మడి జిల్లా విజయడెయిరీ సంస్థ, ఆదిలాబాద్

పాడి రైతులకు ప్రోత్సాహకంగా చెల్లించే సొమ్ము వివరాలను ప్రతి నెల వివరాలను గత 14 నెలల నుంచి వివరాలు ప్రభుత్వానికి ఆన్‌లైన్లో పొందుపరిచాం. ప్రభుత్వం ఆ సొమ్ము విడుదల చేయగానే రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేస్తాం. ఉమ్మడి జిల్లాలోని ఐకేపీ పరిధిలో కొనసాగిన 6బీఎంసీల రైతులకు చెల్లించాల్సి ప్రోత్సాహక సొమ్ము విషయమై సంబంధిత జిల్లాల డీఆర్డీఏ పీడీలకు లేఖలు రాసి వారి దృష్టికి తీసుకెళ్లాం. బకాయిల చెల్పింపు ప్రకియ వారి పరిశీలనలో ఉంది.విశ్వాసంతో పాలు పోశాంపుట్టి భాగ్యలక్ష్మి, పిప్రి, లోకేశ్వం, నిర్మల్

ప్రైవేటులోను పాలకు ఎంతో డిమాండ్ ఉంది. వివిధ సమస్యల కారణంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఐకేపీ డెయిరీకి నమ్మకంతో రోజుకు 20లీటర్ల చొప్పున పాలు విక్రయించాం. లీటరుకు రూ.4 చొప్పున నాలుగేళ్ల నుంచి సుమారు రూ.80వేలు ప్రోత్సాహక బకాయిలు రావాలి. పాతబకాయిలు చెల్లించకపోగా విజయ డెయిరీ కూడా తమకు సకాలంలో ప్రోత్సాహకం ఇవ్వకపోవడం రైతుల నమ్మకాన్ని దెబ్బతీస్తుంది.

# కాసులిస్తేనే.. కలల సౌధం!

మహబూబాబాద్ : ఇది కురవి మండలంలోని ఓ గ్రామంలో సర్కారు నిర్మిస్తున్న రెండు పడకల గది ఇల్లు. ఇక్కడ 60 గృహాలు మంజూరయ్యాయి. అన్ని ఇళ్ల పిఈల్లర్లు, స్లాబ్ వరకు పోశారు. మిగిలిన పనులు పూర్తి చేయకుండానే వదిలేశారు. అలస్యం అవుతుండడంతో ఒక లబ్ధిదారుడు తన సొంత డబ్బులతో గోడలు నిర్మించుకున్నట్లు సమాచారం. దర్వాజలు కూడా ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఈ లబ్ధిదారుడు ఇప్పటికే తన కలల సౌధం కోసం అక్కడి నాయకులకు రూ.2 లక్షల వరకు ఇచ్చారు. ఇతనొక్కడే కాదు మిగిలిన 59 మంది లబ్ధిదారుల వద్ద డబ్బులు తీసుకున్నారు. అధికారులకు ఈ విషయం తెలిసినప్పటికీ 'మాములు'గా తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి.గూడులేని పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం రెండుపడక గదుల ఇళ్ల నిర్మాణం పథకాన్ని ప్రవేశపెట్టింది. అర్హులైన లబ్ధిదారులు ఎవరికీ ఒక రూపాయి కూడా ఇవ్వకూడదని చెప్పింది. కానీ కురవి మండలంలోని ఓ గ్రామంలో ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు గుత్తేదారు, అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు. ఎక్కడైనా ఇళ్ల నిర్మాణం పూర్తైన తరువాతనే లబ్ధిదారుల ఎంపిక చేస్తారు. కానీ ఈ గ్రామంలో పునాది పోయడానికి ముందే డబ్బులిచ్చిన వారికే డబుల్ బెడ్ రూం ఇల్లు వస్తుందని బేరాలు పెట్టారు. ఒక్కో ఇంటికి రూ. 2 లక్షలు ఇవ్వాలంటూ వసూలు చేశారు. ఇప్పుడు శ్లాబ్ ఏరియాను పెంచుతున్నాం దానికి అదనంగా మరిన్ని డబ్బులు అవసరపడుతాయి ఇవ్వాలంటూ వసూలకు తెర లేపారు. కొంత మంది ఇవ్వగా ఇంకొందరు ఇవ్వకపోవడంతో నిర్మాణ పనుల్ని నిలిపివేశారు.

శ్లాబ్ ఏరియా పెంచడానికి

తొలుత స్థలం కొనుగోలుకు, గుత్తేదారుకు డబ్బులు ఇవ్వాలంటూ పెద్ద మొత్తంలో వసూలు చేసిన వారు ఇప్పుడు శ్లాబ్ ఏరియా పెంచుతున్నామని అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మాణం మొత్తం 51.74 చదరపు అడుగుల్లో చేపట్టాలి. డబ్బులకు ఆశపడిన అక్రమార్కులు ఇప్పుడు శ్లాబ్ ఏరియా పెంచితే ఇళ్లు చూడడానికి బాగుటుందని దానికి ఒక్కొ ఇంటి లబ్ధిదారుడు రూ. 35 వేలు ఇవ్వాలంటూ వసూలు చేస్తున్నారు. 60 మందిలో ఇంకా 20 నుంచి 25 మంది వరకు డబ్బులు పూర్తి స్థాయిలో చెల్లించలేదు. శ్లాబ్ ఏరియా పెంచడానికి ఇళ్ల ముందు ఇసుక, కంకరను పోసి నిర్మించకుండానే వదిలేశారు. పనులు ప్రారంభించాలని అడిగితే అందరూ డబ్బులు ఇచ్చిన తరువాతనే పనులు చేస్తామని గుత్తేదారు చెబుతున్నట్లు కొంత మంది డబ్బులు ఇచ్చిన లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

స్థలం పేరుతో వసూలు

గ్రామంలో ఊరికి దూరంగా ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ అక్కడ ఇళ్ల నిర్మాణం చేస్తే లబ్ధిదారులు నివాసం ఉండేందుకు ఇబ్బందిగా ఉంటుందనే భావనతో దానిని ఆసరా చేసుకున్న కొందరు వ్యక్తులు స్థలం కొనుగోలు చేయాలంటూ..అందుకు లబ్ధిదారుల నుంచి వసూలుకు తెరలేపారు. ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షల తీసుకుని అందులోంచి రూ.1.50 లక్షలు స్థలం కొనుగోలుకు, మిగిలిన రూ.50 వేలను ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోవని వాటిని గుత్తేదారుకు ఇవ్వాలంటూ మొత్తంగా 60 మంది నుంచి రూ.1.20 కోట్లను వసూలు చేశారు.

డబ్బులు ఇవ్వొద్దు- డెవిడ్, అదనపు కలెక్టర్, మహబూబాబాద్

డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించి ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దు. ఆ గ్రామంలో వసూళ్లకు పాల్పడిన విషయం మా దృష్టికి రాలేదు. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి వారిని అక్కడి పరిస్థితులపై విచారణ చేయమని చెబుతా.

# పల్లెప్రగతిలోనైనా గతి మారేనా..!

జనగామ : పల్లెల్లోని దుస్థితికి విముక్తి కల్పించి ప్రగతిని పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన పథకం పల్లెప్రగతి. నాలుగు విడతల్లో జరిగిన అభివృద్ధిని పరిగణలోకి తీసుకుని ఐదో విడత చేపట్టింది. 15 రోజుల పాటు జరిగే కార్యక్రమంలో ఉన్నతాధికారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు భాగస్వాములై పల్లెల్లోని సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. ఈ మేరకు ఉన్నతాధికారులు విస్తృతంగా పర్యటిస్తూ.. పనులను పరిశీలిస్తున్నారు. నిర్లక్ష్యం వహిస్తే హెచ్చరిస్తున్నారు. ఐదో విడత ప్రారంభమై ఐదు రోజులైంది. పల్లెల్లోని పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన కొన్ని సమస్యలను గుర్తించింది. అందులో కొన్ని మాత్రమే మీ ముందుకు తీసుకొస్తున్నా.. అధికారులూ చొరవ చూపి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలోని గ్రామ పంచాయతీలు: 281
నియమించిన ప్రత్యేక అధికారులు : 12
గుర్తించిన క్రీడా ప్రాంగణాలు : 122

ఇది తరిగొప్పుల మండల కేంద్రంలోని పల్లెప్రకృతి వనం. దీనికి రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడంతో అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారుతోంది. ప్రకృతివనంలోనే మలమూత్ర విసర్జన చేస్తున్నారు. ఇందులో ఎదుగుతున్న మొక్కలను మేకలు మేస్తున్నాయి. వాకింగ్ ట్రాక్‌లో ఇటుకలు చిందరవందరగా ఉండడంతో వాకింగ్ చేసేందుకు ఇబ్బందిగా ఉంటుంది. ఇందులోనే నర్సరీని కూడా ఏర్పాటు చేయడంతో ఇది పల్లెప్రకృతి వనామా? లేక నర్సరీనా అనే సందేహం ప్రజల్లో కలుగుతుంది. మండల కేంద్రంలోని పచ్చని ప్రాంగణంగా రూపుదిద్దుకుంటున్న ప్రకృతివనానికి రక్షణకంచె ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

ల్లాలోని గ్రామ పంచాయతీలు: 281
నియమించిన ప్రత్యేక అధికారులు : 12
గుర్తించిన క్రీడా ప్రాంగణాలు : 122

పొంచి ఉన్న ప్రమాదం

మండలంలోని సముద్రాల ప్రధాన రహదారిని ఆనుకొని పురాతనమైన మైసం బావి ప్రమాదకరంగా ఉంది. ఈ రహదారి వెంట వందలాది వాహనాలు వెళ్తూ.. వస్తుంటాయి. గతేడాది కురిసిన వర్షాలకు బావి నిండి రహదారిని కుంగతీసింది. ప్రమాదాలు జరగకుండా తాత్కాలికంగా రక్షణ కంచెను ఏర్పాటు చేశారే తప్ప శాశ్వత పరిష్కారం చూపలేకపోయారు. వచ్చే వర్షాకాలంలో చెరువుకు, బావికి మధ్య బుంగ పడే అవకాశముందని, పాఠశాలల బస్సులు పిల్లల్ని తీసుకెళ్తున్న క్రమంలో ఈ బావి వద్ద ఎప్పుడు ఏం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లెప్రగతిలోనైనా ఈ దారిని బాగు చేస్తారేమోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

అంతర్గత బాటను బాగుచేయరూ..రఘునాథపల్లి మండలం నిడిగొండలోని పది ఫీట్ల వెడల్పుతో కూడిన అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. నాలుగు కాలనీలకు అనుసంధానంగా ఉన్నప్పటికీ ఆ కాలనీ ప్రజలకు ఉపయోగపడడం లేదు. చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో నిండుకున్నాయి. దీంతో పందులకు స్థావరాలుగా మారుతున్నాయి. కిలోమీటర్ మేర ఉన్న బాటను పట్టించుకోక ఆక్రమణకు గురవుతోంది. గ్రామ పంచాయతీ డోజర్‌తోనైనా లేదా పారిశుద్ధ్య కార్మికులతోనైనా పనులు చేయిస్తే ఈ దారి ఒక్క రోజులో బాగుపడుతుంది. పల్లెప్రగతిలో గ్రామాన్ని సందర్శిస్తున్న అధికారులు కాస్తా ఈ అంతర్గత బాటను బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

పల్లె ప్రగతి వేళనైనా పరిష్కారమయ్యేనా?

గ్రామాల్లో సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం పల్లె ప్రగతిని అమలు చేస్తోంది. ఐదో విడత అమలవుతున్నా.. కొన్ని గ్రామాల్లో సాధారణ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. జనగామ మండలం అడవికేశ్వాపూర్‌లో ఓ వీధిలోని రహదారిపై మట్టి, రాళ్లు పేరుకుపోయి నెలలు గడుస్తున్నా, మరో రహదారిపై నల్లాల గేట్‌వాల్వ్ ప్రమాదకర గుంతతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నా.. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. పల్లె ప్రగతి ద్వారానైనా సమస్యలు పరిష్కారం కావాలని ప్రజలు కోరుతున్నారు.

## అమలు కాని హామీ.. ఆరేళ్లుగా అదే కూలీ

సిరిసిల్ల: రాష్ట్రంలో అత్యధికంగా నేత కార్మికులున్న సిరిసిల్ల.. తొలి టెక్స్‌టైల్ పార్కు ఇక్కడే ఉంది. వస్త్రోత్పత్తి రంగం తరచూ ఆటుపోట్లకు గురవుతోంది. ఏదో ఒక సమస్య ఎదురవుతుండటంతో పడిలేస్తూ ముందుకు సాగుతోంది. తాజాగా మరో సమస్య సవాలు విసురుతోంది. మొన్నటి వరకు సిరిసిల్లలోని మరమగ్గాల పాలిస్టర్, కాటన్ వస్త్రోత్పత్తుల్లో పనిచేసే కార్మికులు, ఆసాములు కూలీ ధరలు.. ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలపై విడతల వారీగా సమ్మెలు చేశారు. తర్వాత మే 1న టెక్స్‌టైల్‌పార్కు యజమానులు పరిశ్రమలు మూసివేసి సమ్మెకు దిగారు. మంత్రి కేటీఆర్ స్పందించి విద్యుత్తు రీయంబర్స్‌మెంటు.. రాయితీల విడుదలకు హామీ ఇవ్వడంతో ఒక్క రోజులో సమ్మెను విరమించుకున్నారు. ఇప్పుడు అదే టెక్స్‌టైల్ పార్కులోని కార్మికులు ఆరేళ్లుగా కూలీ ధరల పెంపులో జరుగుతున్న జాప్యంపై ఈనెల 12 నుంచి సమ్మెకు సిద్ధమవుతున్నారు.

తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోని టెక్స్‌టైల్ పార్కులో 70 యూనిట్లు.. సుమారు 1500మంది కార్మికులు రోజుకు సుమారు రెండు లక్షల మీటర్ల వస్త్రోత్పత్తి చేస్తున్నారు. వీరంతా రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాలు. ఆరేళ్లుగా కూలీ ధరలు పెంచకపోవడం.. వారిని రోడ్డెక్కేలా చేస్తోంది. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు రోజు కూలీ సరిపోవటంలేదు. ఆరేళ్ల క్రితం జరిగిన కూలీ ధరల ఒప్పందంతో ప్రస్తుతం కుటుంబాలు పోషించుకోలేని పరిస్థితి. కార్మికులంతా కలిసి కూలీ పెంచాలని పార్కులోని యజమానులు, చేనేత, జౌళిశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. లేకుంటే సమ్మెకు వెళ్తామన్నారు. దీనిపై నోటీసులు ఇచ్చినా తీసుకోవడం లేదని వాపోతున్నారు. 2018 నుంచి పెంచాల్సిన కూలీ ధరలతో 48 నెలలకు గాను ఒక్కో కార్మికుడు రూ.70వేల వరకు తమ కష్టార్జితాన్ని నష్టపోయాడు. ఇటీవల పార్కుకు 57 లక్షల మీటర్ల బతుకమ్మ చీరల జాకెట్, వసతి గృహాలకు చెందిన 57 లక్షల మీటర్ల షూటింగ్, షర్టింగ్ చెందిన ప్రభుత్వ వస్త్రం ఆర్డర్లు వచ్చాయి. కూలీ ధరల పెంపు ఒప్పందం కుదిరితేనే వీటిని ఉత్పత్తి చేస్తామని కార్మికులు చెబుతున్నారు.

కార్మికులు కోరుతున్నది ఇదీ..పార్కులో ప్రైవేటు వస్త్రానికి పది పిక్కులకు 45పైసలు. బతుకమ్మ చీరలు, జాకెట్ పీస్ వస్త్రానికి రెండు పన్నులకు కలిపి మీటరుకు రూ.5 కూలీ చెల్లించాలి. పి.వి, పి.సి, ఆర్.వి.ఎం, రంజాన్, క్రిస్మస్ ఇతర ప్రభుత్వ వస్త్రాలన్నింటికీ ప్రభుత్వ పరంగా మెరుగైన కూలీ పెంచాలి. ఏడాదికి 8.33 శాతం బోనస్‌గా చెల్లించాలి. పరిశ్రమలో పనిచేసే కార్మికులకు మౌలిక, రక్షణ సౌకర్యాలు కల్పించాలి.

అటకెక్కిన హామీలు

పార్కులో పనిచేసే కార్మికులకు రెండేళ్లకోసారి కూలీ ధరలు పెంచాలి. ప్రస్తుతం అమలవుతున్న కూలీ ధరలు 2016, జూన్‌లో జరిగిన ఒప్పందం. 2018, 2020, 2022 జూన్‌లో పెంచాల్సి ఉన్నా ఇప్పటికీ 2016లో కూలీ ధరలే కొనసాగుతున్నాయి. ఇందులో 180 ఆర్పీఎం కన్నా తక్కువ యంత్రాలపై పనిచేసేవారికి పది పిక్కులకు 36.50 పైసలు. 180 ఆర్పీఎం కంటే ఎక్కువ ఉన్న యంత్రాలపై పనిచేసేవారికి 35.50 పైసలు చెల్లించాలని ఒప్పందం చేసుకున్నారు. దీని కాలపరిమితి 2018 జూన్‌తో ముగిసింది. అప్పుడు సమ్మెకు వెళ్లినా అప్పటి కలెక్టర్, చేనేత, జౌళిశాఖ అధికారులు, పార్కు యజమానులతో సమావేశం నిర్వహించి కూలీ ధరలు పెంచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తర్వాత నెలల వ్యవధిలో కరోనా ప్రభావంతో వారి హామీలు అటకెక్కాయి.

నాలుగు రోజుల్లో స్పందించాలి– కోడం రమణ, టెక్స్‌టైల్ పార్కు కార్మిక సంఘం అధ్యక్షుడు

పార్కులో పనిచేసే కార్మికులు కష్టపడితేగానీ పూట గడవని కుటుంబాలు ఉన్నాయి. ఆరేళ్లుగా ఒకే కూలీ ధరలతో పనిచేస్తున్నాం. మార్కెట్‌లో అప్పటికీ ఇప్పటికీ మూడింతల ధరలు పెరిగాయి. మా సమస్యలపై నాలుగు రోజుల్లో స్పందించి కూలీ ధరల పెంపు ఒప్పందం చేసుకోవాలి. లేకుంటే ఆదివారం నుంచి సమ్మెకు వెళ్తాం.

కుటుంబ పోషణ భారమైంది– అక్కల శ్రీనివాస్, కార్మికుడు

మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు భగ్గుమంటున్నాయి. రోజంతా కష్టపడితే రూ.300 సైతం రాని పరిస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితిలో కార్మికులు వారి కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారింది. యజమానులు, అధికారులు చొరవతీసుకొని కూలీ ధరలు పెంచాలి.

## పర్యాటకం.. పడవకే పరిమితం

గోదావరిఖని : ఇక్కడ కనిపిస్తున్న 80 సీట్ల సామర్థ్యం గల పడవను పర్యాటక శాఖ మంజూరు చేసింది. గోదావరి నదిలో ఆహ్లాదంగా తిరిగేందుకు ఏర్పాటు చేశారు. నిర్వహణ నిధులు.. నదీ తీర అభివృద్ధికి ఎలాంటి బడ్జెట్ కేటాయించలేదు. దీంతో ఈ పడవను వినియోగించకుండా గోదావరి ఒడ్డున పెట్టారు. నీటి ప్రవాహానికి పడవ రాజీవ్ రహదారి వరకు కొట్టుకొచ్చింది.

పారిశ్రామికంగా రామగుండం అభివృద్ధి చెందింది.. పక్కనే గోదావరి తీరం.. నిత్యం నిండుకుండలా నీరు.. బోటింగ్.. ఆహ్లాదభరిత వాతావరణం.. నిత్యం పర్యాటకులతో కళకళలాడే ప్రదేశంగా అభివృద్ధి చేయాలన్న ప్రణాళికలు ముందుకు సాగడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నిండుకుండలా మారిన గోదావరినది తీరంలో పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపినా పర్యాటక శాఖ నుంచి ఎలాంటి స్పందన లేదు. గోదావరిఖని పట్టణానికి సమీపంలోని గోదావరి తీరం పక్కనే సమ్మక్క, సారలమ్మ జాతర ప్రాంగణం.. ఆ పక్కనే రెండు జిల్లాలను కలిపే కోల్‌బెల్టు వారధి.. నదీ తీరంలో శివుని విగ్రహం.. ఈ ప్రాంతంలో ఆహ్లాదభరితంగా పచ్చని మైదానం.. ఉద్యానవనంతో పాటు పిల్లల పార్కు ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో పాటు నదిలో బోటింగ్‌తో పర్యాటక కేంద్రంగా మార్చాలని భావించారు. కానీ, కేవలం ఒకే ఒక పడవను పంపించిన పర్యాటక శాఖ ఇప్పటివరకు దాని అభివృద్ధి విషయంలో నిధులు మంజూరు చేయడం లేదు. స్థానిక ఎమ్మెల్యే పర్యాటక శాఖ మంత్రితో పాటు శాఖ అధికారులను కలిసి నిధుల కేటాయింపునకు ప్రయత్నించారు. హరిత గెస్టుహౌస్‌తో పాటు సైక్లింగ్ లాంటి పడవలు.. బోటింగ్ ద్వారా గోదావరి తీరం నుంచి ఇటు ఎల్లంపల్లి ప్రాజెక్టు.. అటు సుందిళ్ల బ్యారేజీ వరకు పడవల్లో తిరుగుతూ ఆహ్లాదంగా గడిపే అవకాశం ఉంది. రెండు జిల్లాలను కలుపుతూ ఉన్న వంతెనతో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాకు చెందిన పర్యాటకులు ఎక్కువగా ఇక్కడికి రానున్నారు. పర్యాటకంగా అభివృద్ధి చెందితే ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పర్యాటకులు ఎక్కువగానే సందర్శించేందుకు ఆస్కారం ఉంది. రామగుండంలోనే 3 లక్షల జనాభా ఉండటంతో పాటు వివిధ ప్రాంతాల్లో పనులు చేస్తూ స్థిరపడ్డ వారు ఇక్కడికి వస్తుంటారు. హరిత గెస్టుహౌస్‌తో పాటు మరికొన్ని పడవలు.. నదిలో విహరించేందుకు అనుకూలంగా ఉండే పడవలు మంజూరు చేస్తే గోదావరి తీరం పర్యాటక కేంద్రంగా మారే అవకాశం ఉంటుంది.

# సాగులో ముందంజ.. పరిశ్రమల్లో వెనుకంజ



జగిత్యాల : పంటల సాగురీత్యా జగిత్యాల జిల్లా ముందు వరుసలో నిలుస్తున్నా అనుబంధ పరిశ్రమల ఏర్పాటులో మాత్రం వెనుకంజలోనే ఉంది. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనలకు ప్రభుత్వం అనుమతుల జారీని మరింత సరళతరం చేయగా జిల్లాలో పరిశ్రమల వృద్ధికిగల అపార అవకాశాలిలా ఉన్నాయి...

జిల్లాల పునర్వ్యవస్థీకరణ తరువాత జగిత్యాలలో కేవలం రెండుమాత్రమే భారీ పరిశ్రమలు, 181 చిన్నతరహా పరిశ్రమలు మిగలగా పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్నవారు కేవలం 3,211 మంది మాత్రమే ఉండటం పారిశ్రామిక లోటును వెల్లడిస్తోంది. టీఎస్ఐపాస్ ద్వారా నిరుడు 203 యూనిట్లకు అనుమతులనివ్వగా పీఎంఈజీపీ ద్వారా 39 మందికి ఉపాధి కల్పించారు. టీప్రైడ్‌ద్వారా 16 మందికి రూ.37.45 కోట్ల పెట్టుబడి రాయితీని ఇచ్చారు. ఈ సంవత్సరం టీఎస్ఐపాస్ ద్వారా రూ.80 కోట్ల పెట్టుబడితో 1,124 యూనిట్లకు అనుమతి ఇవ్వగా 8,976 మందికి ఉపాధి కల్పించనున్నారు. టీప్రైడ్ ద్వారా జిల్లాలో 214 ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు పెట్టుబడి రాయితీకింద రూ.18.14 కోట్లను మంజూరివ్వనున్నారు. దళితబంధు యూనిట్లలోనూ వ్యవసాయాధారిత చిన్నతరహా పరిశ్రమలను విస్తృతంగా నెలకొల్పవచ్చు.

సాధారణ పరిస్థితుల్లో సాలీనా 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుంది కాబట్టి బియ్యంమిల్లులు, ఉప ఉత్పత్తుల మిల్లుల ఏర్పాటు ప్రధాన ఆవశ్యకతగా ఉంది. జిల్లాలో సాలీనా 1.32 లక్షల టన్నుల మామిడి కాయలు ఉత్పత్తి అవుతుండగా మామిడి తాండ్ర, రసంతయారీ పరిశ్రమ ఏర్పాటు చేయవచ్చు. 80 వేల క్వింటాళ్ల పసుపు ఉత్పత్తవుతుండగా పాలిషింగ్, ఉప ఉత్పత్తులయిన పొడి, రంగులు, ఔషధాల తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేయవచ్చు. మరో ప్రధాన పంటయిన మొక్కజొన్నను సాలీనా 55 వేల హెక్టార్లలో పండిస్తుండగా ఉప ఉత్పత్తులైన కోళ్లదాణా, బిస్కట్లు, గంజిపొడి పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా ఉంటుంది. 42 వేల ఎకరాల్లో సంకరవరి, సూటివరి, గడ్డిజొన్న, తెల్లజొన్న, ఎర్రజొన్న, ఆవాలు, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, నువ్వులు తదితర పంటల్లో విత్తనోత్పత్తి చేపడుతున్నారు. దీనికిగాను విత్తనశుద్ధి కర్మాగారాలను, విత్తనోత్పత్తి కంపెనీలను నెలకొల్పవచ్చు. నువ్వులు, సోయాబీన్, వేరుసెనగ, కుసుమ, ఆవాలు, పొద్దుతిరుగుడు పంటల ఆధారితంగా నూనెమిల్లులు, కంది, పెసర, మినుము ఉత్పత్తులకు పప్పుమిల్లులను ఏర్పాటు చేయవచ్చు. పత్తికి జిన్నింగ్‌మిల్లు, మిరప ఉపఉత్పత్తుల తయారీ మిల్లులను ఏర్పాటు చేయవచ్చు. అరటి, బొప్పాయి, ఇతర పండ్లతోటలు, కూరగాయలసాగు అధికంగా ఉండగా ఇటీవల పలువురు రైతులు హరిత గృహాల్లోనూ కూరగాయలను, పూలను పండిస్తున్నారు. దీనికిగాను అన్ని పంటల్లోనూ ఆహారశుద్ధి, ఎగుమతి పరిశ్రమలను నెలకొల్పేలా యువతకు రాయితీలనివ్వాలి.

ఇప్పటికే పలు గ్రామాల్లో రైతులు ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లుగా(ఎఫ్.పి.ఒ) ఏర్పడగా నాబార్డుద్వారా ఒక్కోదానికి మొదటి మూడు సంవత్సరాలపాటు రూ.18 లక్షల చొప్పున సాయాన్ని అందించనున్నారు. ప్రతి ఎఫ్‌పీఓకు రూ.2 కోట్లవరకు గరిష్ఠంగా రుణ గ్యారంటీని కేంద్రం కల్పించగా ప్రతి సభ్యునికి రూ.15 లక్షల వరకు ఈక్విటీ మద్దతు కల్పిస్తారు. ఎఫ్‌పీఓల ద్వారా రైతుల ఉత్పత్తులను సేకరించి ఎగుమతి చేయటం ప్రధానాంశంగా కృషిచేస్తారు కాబట్టి మామిడి, పసుపు, సన్నధాన్యం, మక్కలు, కందులు, ఇతర ఉత్పత్తులను సాగుచేసే రైతులకు ఆసరా కలిగించేలా జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ ఎఫ్‌పీఓలను నెలకొల్పాలి.

పరిశ్రమలశాఖ, రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా పల్లెల్లో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకుగాను స్థలాన్ని ప్రణాళికలను సిద్ధంచేస్తున్నారు. పారిశ్రామిక ప్రాంత స్థానిక ప్రాధికార హోదాతో వీటిని ఏర్పరచనుండగా వీటిల్లో స్థానిక పారిశ్రామికవేత్తలకు, ఉపాధి కల్పనకు అవకాశం కల్పిస్తారు. ఈ క్రమంలో జిల్లాలోని మెట్పల్లి మండలం మెట్లచిట్టాపూర్ వద్ద 150 ఎకరాల్లో ఫుడ్‌ప్రాసెసింగ్ ప్లాంటును, వెల్గటూరు మండలం స్తంభంపల్లి వద్ద 75 ఎకరాల్లో మెగా ఫుడ్‌పార్కును ఏర్పరచనున్నారు. పారిశ్రామిక అభివృద్ధి మండళ్ల కేటాయింపుల్లో భాగంగా జిల్లాకు మామిడి పరిశోధన కేంద్రాన్ని కేటాయించినా క్షేత్రస్థాయికి చేరాల్సి ఉంది. 4.43 లక్షల ఎకరాల సాగుకుగాను ఆయకట్టులోనే అధికంగా ఉండటం పరిశ్రమల స్థాపనకు కలిసివచ్చే అంశంగా ఉంది.

# రెండేళ్లుగా కు.ని.కి పాట్లు




సిరిసిల్ల: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిపించడంలో ఉన్న శ్రద్ధ.. కుటుంబ నియంత్రణ (కు.ని)పై చూపించడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్ఎస్‌వి (నోస్కాల్ పల్ వేసెక్టమీ) శిబిరాలను వైద్య, ఆరోగ్యశాఖ ఏర్పాటు చేయడంలేదు. జిల్లా ఆసుపత్రితోపాటు.. వేములవాడలోని ప్రాంతీయ ఆసుపత్రి.. 13 ఆరోగ్య కేంద్రాలు అందులో ఐదు 24గంటల వైద్యసేవలందించేవి ఉన్నాయి. కొవిడ్ వ్యాప్తి నాటి నుంచి.. దాదాపు రెండేళ్లకు పైగా ఈ శిబిరాల ఊసేలేదు. గత మార్చిలో వేములవాడ ఆసుపత్రుల్లో ఒక్క శిబిరం మాత్రమే నిర్వహించారు. సాధారణ ప్రసవాలు.. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొందిన వారు జిల్లా వ్యాప్తంగా వేలల్లో కు.ని. శిబిరాల కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో ఎంతోమంది కోత, కుట్టు లేని ఎన్ఎస్‌వి కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో మహిళలకు ట్యుబెక్టమీ శస్త్ర చికిత్స చేసేవారు. ఇలా చేయించుకున్నవారు దాదాపు వారం పాటు ఎలాంటి పనులను చేయకుండా విశ్రాంతి తీసుకోవాలి. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు వ్యవసాయం, కూలీ పనులకు వెళ్లేవారే ఎక్కువగా ఉంటారు. దీనివల్ల కొన్ని అనారోగ్య సమస్యలు తలెత్తేవి. ఈ నేపథ్యంలో మహిళలు, పురుషులు, ఎన్ఎస్‌వి చికిత్సకే ఆసక్తి చూపుతున్నారు. ఈ శస్త్ర చికిత్స చేసుకున్నాక కొన్ని గంటల అనంతరం ఎప్పటిలాగే పనులు చేసుకోవచ్చు. దీనివల్ల కు.నికి బాగా ఆదరణ పెరిగింది. గతంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెద్ద ఎత్తున శిబిరాలు జరిగేవి. కు.ని చేయించుకొన్న వారికి ప్రోత్సాహకంగా ప్రభుత్వం రూ.1100 అందిస్తుంది. రెండేళ్లుగా వాటి ఊసేలేదు. ప్రస్తుతం గ్రామాల్లో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలను శిబిరాల నిర్వహణ కోసం ఆయా గ్రామాల మహిళలు ఆరాతీస్తున్నారు. ఆసుపత్రికి వెళ్లినపుడు వైద్యులను అడిగినా తమకు ఎలాంటి సమాచారంలేదనే సమాధానం వస్తుంది. జిల్లాలో ఎన్ఎస్‌వి చికిత్సపై అనుభవం ఉన్న ఒక్క వైద్యుడు ఉద్యోగవిరమణ పొందారు. ప్రస్తుతం కుట్టు, కోతలేని శస్త్రచికిత్సలు చేసేందుకు శిక్షణ పొందిన వైద్యులు లేరు. వైద్యుల కొరతకు తోడు ప్రభుత్వం కు.ని శిబిరాలపై దృష్టిసారించక పోవడంతో రెండేళ్లుగా ఎదురుచూపులు తప్పడంలేదు.

ప్రైవేటులో భారం

గ్రామాలు, పట్టణాల్లో, పేద, ధనిక బేధం లేకుండా పూర్తిగా చిన్న కుటుంబాలపైనే ఆసక్తి చూపుతున్నారు. 'మే మిద్దరం.. మాకిద్దరు' అనే ధోరణిలో ఉన్నారు. అప్పుడప్పుడు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆసుపత్రుల్లో మహిళలకు మాత్రం ప్రసవ సమయంలో ట్యుబెక్టమీ శస్త్ర చికిత్స చేస్తున్నారు. శిబిరాలు నిర్వహించకపోవడంతో పేదల, మధ్యతరగతి మహిళలు శస్త్ర చికిత్సల కోసం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ ఒక్కో శస్త్రచికిత్సలకు రూ.10వేల పైనే వసూలు చేస్తున్నారు. ఇది నిరుపేదలకు అదనపు భారంగా మారుతోంది. శిబిరాలు నిర్వహించాలనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ప్రణాళిక చేస్తాం..– పద్మయ్య, జిల్లా కు.ని. శిబిరాల సమన్వయకర్త

జిల్లాలో ఎన్ఎస్‌వీ శస్త్ర చికిత్సలు చేసే వైద్యులు లేరు. కరీంనగర్ నుంచి వైద్యులు రావాలి. అందువల్ల శిబిరాలు నిర్వహించడంలో జాప్యం జరుగుతోంది. గత మార్చిలో వేములవాడలో 70 కు.ని.లు చేయించాం. వాటికి సంబంధించిన డబ్బులు ఇంకా రాలేదు. ఇక నుంచి ప్రతినెలా శిబిరాలు నిర్వహించేలా ప్రణాళికలు చేస్తాం.

ఆరునెలలుగా నిరీక్షణ– భుజంకార్ సాయిబాబా, రాచర్ల బొప్పాపూర్, ఎల్లారెడ్డిపేటవ్యవసాయం చేసుకుంటూ జీవిస్తాం. మాకు ఇద్దరు పిల్లలు. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స నిమిత్తం కు.ని. శిబిరాల నిర్వహణకు ఆరు నెలలుగా ఎదురుచూస్తున్నాం. గ్రామంలోని ఆశ కార్యకర్త మొదలు ఆసుపత్రిలో వైద్యులను సంప్రదిస్తే సమాచారం లేదని చెబుతున్నారు. లేదంటే ఆసుపత్రిలో సూదిమందు ఇస్తున్నారు. ఇది మూడు నెలలపాటు మాత్రమే పనిచేస్తుంది. శస్త్రచికిత్స చేసుకుంటే శాశ్వతంగా ఉంటుంది.

## సామాజిక మరుగుదొడ్ల ప్రస్తావన ఏదీ..?

సిరిసిల్ల: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్లెప్రగతి కార్యక్రమంలో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారు. ప్రతి గ్రామంలో తప్పనిసరిగా కంపోస్టు షెడ్డు, డంపింగ్ యార్డు, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు వంటివి చేపట్టారు. చాలా వరకు అన్ని గ్రామాల్లో ఇప్పటికే ఇవి పూర్తయ్యాయి. ఇటీవల ప్రారంభమైన ఐదో విడత పల్లె ప్రగతి కార్యక్రమంలో ప్రతి గ్రామంలో ఒక క్రీడా మైదానం ఏర్పాటుకు ఎకరం స్థలాన్ని కేటాయించాలని నిర్ణయించారు. చాలా గ్రామాల్లో స్థలాల కొరత ఉందని ప్రభుత్వానికి అధికారులు తెలిపారు. గ్రామాల్లో స్థలాభావం దృష్ట్యా కనీసం మండలానికి ఒక్కటైనా క్రీడా మైదానం ఉండాలని ఆ మేరకు రెవెన్యూ అధికారులు స్థలాలను గుర్తించాలని ప్రభుత్వం సూచించింది. ఇవన్నీ బాగున్నా మండల కేంద్రాల్లో చాలాచోట్ల శౌచాలయాలు లేక వివిధ ప్రాంతాల నుంచి మండల కేంద్రాలకు



వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి గ్రామంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాల్లో సామాజిక మరుగుదొడ్లను నిర్మించాలని పలువురు కోరుతున్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాల్లో సామాజిక మరుగుదొడ్లు లేక మహిళలు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు.

ఎన్నోరోజులుగా విజ్ఞప్తులు చేస్తున్నా...రుద్రంగి మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో అత్యవసరాలను తీర్చుకునేందుకు కనీస సదుపాయాలు లేవు. ప్రజా మరుగుదొడ్లు అందుబాటులోకి రావటం లేదు. మండలంలో మొత్తం జనాభా 22 వేలకు పైగా ఉన్నా ఏ ఒక్క గ్రామంలో బహిరంగ మరుగుదొడ్లు కనిపించవు.

విద్యార్థినులకు తప్పని అవస్థలు

నూతనంగా ఏర్పడ్డ మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి. వ్యాపార, వాణిజ్య అవసరాల కోసం నిత్యం మండలంలోని ప్రజలతో పాటు కథలాపూర్, చందుర్తి మండలాల నుంచి తరలి వస్తుంటారు. వివిధ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు తప్ప బయటివారికి మరుగుదొడ్ల సౌకర్యాలు లేవు. వివిధ గ్రామాల నుంచి బ్యాంకులోకి డ్వాక్రా సంఘ సభ్యులు, ప్రభుత్వ కళాశాలలకు విద్యార్థినులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఇలా వచ్చిన వారు బస్సుల కోసం ఇతర వాహనాల కోసం గంటల తరబడి ప్రయాణ ప్రాంగణాల్లో నిరీక్షిస్తుంటారు. ఆ సమయంలో కనీస అవసరాలు తీర్చేందుకు నేటికీ వసతులు లేక పంటి బిగువున భరిస్తున్నారు.

ఉన్నవాటిని కూల్చి.. కొత్త వాటిని విస్మరించి

మండల కేంద్రంలోని ప్రధాన ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఉన్న బహిరంగ మరుగుదొడ్లను ఇటీవల తొలగించారు. ప్రయాణ ప్రాంగణంలోనే ప్రతి గురువారం వారసంత పెద్ద ఎత్తున జరుగుతోంది. ఇక్కడికి జిల్లా నుంచే కాకుండా పక్కనున్న జగిత్యాల జిల్లాకు చెందిన వందలాదిమంది వ్యాపారులు తమ వస్తువులను విక్రయించేందుకు వస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి కనీసం మరుగుదొడ్ల సదుపాయం కల్పించకపోవటంతో ఇబ్బందుల పాలవుతున్నారు. ఇందిరాచౌక్‌లో మరుగుదొడ్లు నిర్మించాలని ప్రజలు ఏళ్ల నుంచి కోరుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. గత ఏడాది క్రితం పంచాయతీ ఆధ్వర్యంలో ఈజీఎస్ నిధుల నుంచి మరుగుదొడ్లను నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. ఏడాదికి పైగా గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది.

మహిళల గౌరవానికి భంగం కలగకుండా చూడాలిసిరిపురం మహేందర్

మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడటానికి ప్రతి గ్రామంలో, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేకంగా సామాజిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి. ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాల్లో నీటి సరఫరా ఏర్పాటుతో ఉండే మరుగుదొడ్లను నిర్మించాలి. రుద్రంగిలో మధ్యలో నిలిచిపోయిన నిర్మాణాలను వెంటనే పూర్తిచేసి వినియోగంలోకి తేవాలి.

ప్రతిపాదనలు పంపించామాలోత్ శంకర్, మండల అభివృద్ధి అధికారి, రుద్రంగి

మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో నూతనంగా కూరగాయల మార్కెట్ షెడ్ల నిర్మాణం చేసి అక్కడే సామాజిక మరుగుదొడ్లను నిర్మించాలని భావించాం. కేటాయించాలనుకున్న స్థలంలో పలు వివాదాలు తలెత్తాయి. అవి పరిష్కారం అయితేనే నూతన నిర్మాణం చేపట్టే అవకాశం ఉంటుంది. మండల కేంద్రంలోని ఇందిరాచౌక్‌లోని ప్రయాణ ప్రాంగణంలో నిలిచిన మరుగుదొడ్ల నిర్మాణం పనులు అతిత్వరలోనే పూర్తి చేస్తాం. మండలంలోని సర్పంచితండా, మానాల, దెగావత్ తండాల్లో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం.

## మిద్దె సాగు.. ఆరోగ్యం బాగు

గోదావరిఖని :పట్టణంలోని టీచర్స్‌కాలనీలోని ఇంద్రాల సతీష్–శారద వృత్తి రీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయులు. పాఠశాలల్లో పిల్లలకు పాఠాలు బోధిస్తూనే ఇంటి వద్ద వీరు ఆచరించేలా కూరగాయల సాగుపై దృష్టి సారించారు. ఇంటి వద్దే సేంద్రియ ఎరువు తయారు చేసి పలు రకాల కూరగాయలను సాగు చేస్తున్నారు. ప్రత్యేకంగా తీగజాతి కూరగాయల కోసం ప్రత్యేక ఫ్రేమ్‌ను తయారు చేయించారు. దీంతో చిన్నచిన్న కుండీలను ఏర్పాటు చేసి అందులో ఆకుకూరలను పెంచుతున్నారు. కూరగాయలతో పాటు జామ, మామిడి, సపోట లాంటి పండ్ల మొక్కలను పెంచుతున్నారు. ఇంటి వద్దే ఎరువు తయారు చేస్తూ గత ఏడాది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డును సైతం శారద అందుకోవడం విశేషం.


సేంద్రియ ఎరువు..పట్టణంలోని చైతన్యనగర్‌లో చిటికేసి రంజిత్–లాస్య దంపతులు ఏడాది నుంచి ఇంటిపైకప్పుపై వివిధ రకాల మొక్కలను పెంచుతూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. టమాట, వంకాయ, బీరకాయ, కాకరకాయ, బెండకాయ, సొరకాయ, గోరుచిక్కుడుతో పాటు పలు రకాల ఆకుకూరలను పండిస్తున్నారు. ఇంటి వద్దే తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేసి మొక్కలకు వేస్తున్నారు. ఇంటిల్లిపాది ఇవే కూరగాయలను ఆహారంగా తీసుకుంటూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటున్నారు.

ప్రత్యేక పందిళ్లు..పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసముంటున్న ఎల్ఐసీ ఉద్యోగి ఎగ్యారపు శ్రీనివాస్ భార్య శ్రీలతతో కలిసి ఇంటిపైన వివిధ రకాల కూరగాయలను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నిత్యం ఇంట్లో లభించే చెత్తతో ఎరువు తయారు చేసుకుంటూ ఆకు కూరలతో పాటు తీగజాతి కూరగాయలను, టమాట, వంకాయ, బెండ, గోరుచిక్కుడులాంటి పంటలను సాగు చేస్తున్నారు. ఇంటిపైన వివిధ డబ్బాలతో పాటు ప్రత్యేక పందిళ్ల సాయంతో ఆకర్షణీయంగా సాగు చేసి వాటినే ఆహారంగా తీసుకుంటూ ఆరోగ్య వంతులుగా నిలుస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

# క్షీణించిన సామర్థ్యం.. ఫలితాలే సాక్ష్యం

నిర్మల్ : విద్యార్థుల్లో ఉన్న కనీస సామర్థ్యాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం ఏటా జాతీయ సాధన సర్వేను నిర్వహిస్తుంది. గత ఏడాది నవంబరులో నిర్వహించిన పరీక్షల్లో వారి ప్రతిభ అంతంత మాత్రమేనని స్పష్టమైంది. కొన్ని విషయాల్లో కనీస సామర్థ్యాలు సైతం నమోదు చేయలేకపోయారు. ముఖ్యంగా కొవిడ్‌తో విద్యాలయాలు తెరుచుకోకపోవడం, ఆన్‌లైన్ తరగతులు సరిగ్గా అర్థం కాకపోవడం వంటి తదితరాల ప్రభావం సర్వే ఫలితాలతో వెల్లడయ్యింది.

ఇదీ పరిస్థితి..కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రతిభా పాటవాలు, వారి విషయ పరిజ్ఞానాన్ని అంచనా వేసేందుకు ప్రతి సంవత్సరం ప్రభుత్వం జాతీయ సాధన సర్వే పరీక్షను నిర్వహిస్తోంది. 3, 5, 8, 10 తరగతులకు గతేడాది నవంబరులో ఈ పరీక్షను చేపట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యాలయాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 175 విద్యాలయాలకు చెందిన 2,608 మంది పరీక్ష రాశారు. 3, 5 తరగతులకు భాష, పరిసరాల పరిజ్ఞానం, గణితంపై, 8, 10 తరగతుల వారికి ఈ మూడు



పాఠ్యాంశాలతోపాటు సాంఘిక శాస్త్రం, పదో తరగతి వారికి ఆంగ్లంపై పరీక్ష నిర్వహించారు.

కొవిడ్‌తో..కరోనా విద్యార్థుల చదువులపై పెను ప్రభావం చూపించింది. బడులు తెరుచుకోకపోవడం, ప్రత్యక్ష తరగతులకు దూరం కావడం, ఆన్‌లైన్ తరగతులు అర్థం కాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. నిర్వహించిన సామర్థ్య సర్వే పరీక్షల్లో ప్రావీణ్యం కలిగిన వారు 171 మంది ఉండగా, 43 మంది ప్రతిభకు మించి తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. కనీస సామర్థ్యాలు, దిగువన అత్యధికంగా ఉన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 639 మంది ఉపాధ్యాయుల అభిప్రాయాలు సేకరించగా అత్యధిక శాతం బోధనా వనరుల కొరత, మూత్రశాలలు, మరుగుదొడ్ల వంటి సమస్యలు తెలియజేశారు. బోధన, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థుల విద్యాభ్యున్నతి తీసుకుంటున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం సాధారణ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరంలోనైనా జాతీయ సాధన సర్వేలో విద్యార్థులు ప్రతిభ చూపేలా, మౌలిక సదుపాయాల మెరుగునకు చర్యలు తీసుకుంటేనే పిల్లలకు మేలు చేకూరనుందని పలువురు పేర్కొంటున్నారు.

ప్రత్యేక దృష్టిఎ.రవీందర్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి, నిర్మల్

కొవిడ్ కారణంగా కొంత ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆ సమస్యను అధిగమించేందుకు ఈ ఏడాది జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగునకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం. ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమ బోధన నేపథ్యంలో పకడ్బందీగా అమలయ్యేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాం. విద్యార్థుల విద్యావికాసం కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. మన ఊరు- మన బడిలో భాగంగా పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నాం.

# ఆటల బడికి ఆహ్వానం..!

మంచిర్యాల : చిన్నారుల ఎదుగుదలకు కృషి చేస్తున్న అంగన్ వాడీల్లో ప్రీ-స్కూల్ నిర్వహణ కీలకం. ఇందులో ప్రవేశాల పెంపునకు రంగం సిద్ధం అయింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు నిర్వహించే బడిబాట తరహాలోనే అంగన్‌వాడీ బడిబాట చేపట్టాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు రాష్ట్ర మహిళా శిశుసంక్షేమ శాఖ నుంచి జిల్లాకు ఉత్తర్వులు అందాయి. ఈ నెల 6 నుంచి 11 వరకు అమలు చేయాలని ఆదేశించారు. స్థానికులు ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, కల్పిస్తున్న సౌకర్యాలపై విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. మంచిర్యాల జిల్లాలో 4 ప్రాజెక్టులు ఉండగా.. వీటి పరిధిలో మొత్తంగా 969 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఇందులో 896 ప్రధాన కేంద్రాలు కాగా, మినీ కేంద్రాలు 73 ఉన్నాయి. ఆయా కేంద్రాల



పరిధిలో సోమవారం నుంచి ఇంటింటా బడిబాట చేపట్టనున్నారు.

కార్యాచరణ ఇలా 6, 7 తేదీల్లో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ర్యాలీలతో ప్రచారం, గ్రామాల్లో సర్పంచ్ సహకారంతో సమావేశాల నిర్వహణ. కేంద్రాల్లో అందిస్తున్న సేవలపై అవగాహన. 8, 9 తేదీల్లో ఇంటింటా తిరుగుతూ రెండున్నరేళ్ల వయస్సు పిల్లల్ని గుర్తించడం, ప్రీ-స్కూల్ విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం, ప్రవేశాల ప్రక్రియ, 5 సంవత్సరాల పిల్లలకు సర్టిఫికేట్ ఇస్తూ స్థానిక ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించడం. 10న తేదీన అంగన్‌వాడీ కేంద్రాల్లో స్వచ్ఛత పరిశుభ్రత, వసతులు సమకూర్చుకోవడం. 11న సామూహిక అక్షరభ్యాసం, సాంస్కృతిక ప్రదర్శన తదితర కార్యక్రమాలు.

పక్కాగా అంగన్‌వాడీ బడిబాట

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో బడిబాట నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. రెండున్నరేళ్లు దాటిన పిల్లల ఇంటికి వెళ్లి అంగన్‌వాడీ కేంద్రాలకు ఆహ్వానం పలుకుతాం. అయిదేళ్లు నిండిన పిల్లలను ప్రీ-స్కూల్ సర్టిఫికేట్లతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పిస్తాం. కార్యక్రమం నిర్వహణపై సంబంధిత అధికారులకు, కార్యకర్తలకు సూచించాం. అందరిక సహకారంతో బడిబాటను విజయవంతం చేస్తాం.- ఉమాదేవి, జిల్లా సంక్షేమశాఖాధికారి, మంచిర్యాల

# ఆరంభం అదిరింది.. కార్యం దాగుంది..!



మంచిర్యాల :ఆదిలాబాద్ పట్టణంలో అభివృద్ధి పనులకు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించడంలో ఉన్న హడావుడి వాటిని పూర్తి చేయడంలో కనిపించడం లేదు. పనులు నత్తనడకన సాగుతున్నా, మధ్యలోనే నిలిచిపోతున్నా స్పందించకపోవడంతో బల్దియా యంత్రాంగంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం గుత్తేదార్లకు వరంగా మారింది. పనులు నాసిరకంగా సాగినా, నెలల తరబడి పెండింగ్‌లో ఉంచినా అడిగే వారు లేకపోవడంతో.. గుత్తేదార్లు ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా మారింది. వార్డుల్లో ప్రజల నుంచి ఒత్తిడి రావడంతో కౌన్సిలర్లు అధికారులకు విన్నవిస్తున్నారు. అయినా ఫలితం లేకుండా పోతోంది. అధికారులతో లాభం లేదనుకుని నేరుగా గుత్తేదారుకే ఫోన్ చేస్తే రేపు మాపు అంటూ తప్పించుకుంటున్నారని పలువురు కౌన్సిలర్లు వాపోతున్నారు.

పాతవే చేయరు.. కొత్త వాటికి టెండర్!

పట్టణంలో జరుగుతున్న బీటీ, సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం తదితర పనులు ఎక్కువగా రెండు ఏజెన్సీలే చేపడుతున్నాయి. గతంలో దక్కించుకున్న పనులనే సకాలంలో పూర్తి చేయని గుత్తేదార్లు కొత్తగా చేపడుతున్న పనులకు పోటీపడి టెండర్లు దాఖలు చేస్తున్నారు. తక్కువ ధరకు కోట్ చేసి వాళ్లే మళ్లీ పనులను దక్కించుకుంటున్నారు. ఫలితంగా పాతవి పూర్తి చేయలేక, కొత్తవి ప్రారంభించక పనులు పెండింగ్‌లో పడుతున్నాయి. ఇదే విషయమై పలువురు కౌన్సిలర్లు గుత్తేదార్లను అడిగితే.. ఒకసారి నిర్మాణ సామగ్రి కొరత ఉందనీ, మరోసారి మేస్త్రీలు, కార్మికుల సమస్య అంటూ దాటవేస్తున్నారని చెబుతున్నారు. బల్దియా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శలను ఎదుర్కొంటున్నారు.

పూజ చేసి రెండు నెలలు

వార్డు నెంబర్ 29లో బీటీ రోడ్డు, మురుగు కాల్వల నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు కేటాయించారు. రెండు నెలల కిందటే పనులకు భూమిపూజ చేశారు. గుత్తేదారు ఇప్పటిదాకా పనులను ప్రారంభించలేదు.

నెలరోజుల నుంచి ఇదే పరిస్థితి

సినిమా రోడ్డు నుంచి మహేశ్వర్ థియేటర్ వైపు వెళ్లే దారికి ఇరువైపులా మురుగు కాల్వలు, బీటీ రోడ్డు నిర్మాణానికి ఎల్ఆర్ఎస్ నిధులను రూ.20 లక్షలు వెచ్చించారు. కంకర వేసి నెలరోజులవుతోంది. అయినా పనులు పూర్తి చేయలేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవలే ఇక్కడ ద్విచక్రవాహనంపై నుంచి ఓ వృద్ధుడు పడి కాలు విరిగింది.

కంకర రాళ్లతో..డీఆర్డీఏ కార్యాలయం నుంచి శాంతినగర్‌కు వెళ్లే దారికి రూ.58 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆరు నెలల కిందటే ప్రారంభించారు. రహదారికి ఇరువైపులా కంకర రాళ్లు వేసి వదిలేశారు. దీంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

నిబంధనలు బేఖాతరు!

పట్టణం నడిబొడ్డున అంబేడ్కర్ కూడలిని సుందరంగా తీర్చిదిద్దేందుకు జరుగుతున్న పనులివి. ప్రభుత్వ అభివృద్ధి పనులకు నల్లటి ఇసుక వాడొద్దని నిబంధనలున్నా.. గుత్తేదారు చవకగా లభించే నల్లటి ఇసుకను తీసుకువచ్చి నిర్మాణంలో వాడుతున్నారు.

# పల్లెల్లో ప్లాట్ల దందా!



మంచిర్యాల : జిల్లాలో ఒకప్పుడు పట్టణాలు, వాటి పరిసర ప్రాంతాలకే పరిమితమైన స్థిరాస్తి వ్యాపారం క్రమంగా పల్లెలకు పాకింది. దీంతో వ్యవసాయ భూములు ప్లాట్లుగా మారిపోతున్నాయి. ఏజెన్సీలో భూముల క్రయవిక్రయాలకు అవకాశం లేకున్నా.. లీజుల పేరిట, తెల్లకాగితాలపై ఒప్పంద పత్రాలు రాసుకొని భూ దందా కొనసాగిస్తున్నారు. రెవెన్యూ అధికారులకు పెద్దఎత్తున ముడుపులు అందుతుండటంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. వ్యవసాయ భూములను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే నాలా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వెంచర్లు ఏర్పాటు చేయాలంటే అంతర్గత రోడ్లు, మురుగునీటి కాలువలు, విద్యుత్తులైన్లు, తాగునీటి నల్లాలు తదితర మౌలిక వసతులు కల్పించాలనే నిబంధనలున్నాయి. కానీ ఇవేమి పాటించకుండా జిల్లాలో స్థిరాస్తి దందా కొనసాగుతోంది. భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నా ఒకర్ని చూసి ఒకరు ప్లాట్లు కొనడానికి ఎగబడుతున్నారు. జిల్లాలోని 15 మండలాల్లో 4.15 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. పట్టణ శివారు, ప్రధాన రహదారుల పక్కనున్న వ్యవసాయ భూములను క్రమంగా ప్లాట్లుగా మారుతున్నాయి. దళారులు ఎకరానికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు కొనుగోలు చేస్తూ వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం ప్రకారం గిరిజనేతరులు భూముల క్రయవిక్రయాలు చేయరాదనే నిబంధనలున్నాయి. కానీ నిబంధనలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. ఈ విషయంపై తహసీల్దారు ప్రమోద్‌కుమార్‌ను సంప్రదించగా.. త్వరలోనే అక్రమ వెంచర్లపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.ఇది కాగజ్‌నగర్ మండలంలోని ఏజెన్సీ పంచాయతీలోని ఈజ్‌గాం శివమల్లన్న స్వామి ఆలయ సమీపంలోని పంట పొలాల స్థలం. కాగజ్‌నగర్- పెంచికల్‌పేట ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో ఈ భూములకు డిమాండ్ ఉంది. ఈ స్థలాన్ని కొంతమంది గిరిజనేతరులు రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేశారు. చాలా వరకు తెల్లకాగితాల మీద క్రయవిక్రయాలు నడుస్తున్నాయి. కొంతమంది 99 సంవత్సరాలు లీజుకు తీసుకుంటున్నట్లు రాయించుకుంటూ భూ దందా కొనసాగిస్తున్నారు. అనంతరం ప్లాట్లుగా మార్చి ఇంటి స్థలాలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

పట్టించుకోని అధికారులు..ఈ చిత్రం కాగజ్‌నగర్ మండలంలోని ఏజెన్సీ పంచాయతీ భట్టుపల్లి శివారులోనిది. సాగుభూమిని ఓ దళారీ కొనుగోలు చేసి ఇటీవల ప్లాట్లుగా విభజించి స్తంభాలు ఏర్పాటు చేశారు. ఎకరానికి రూ.15 లక్షలకు కొనుగోలు చేసి ఒక్కో గుంట స్థలాన్ని రూ.2 నుంచి 3 లక్షలకు విక్రయిస్తున్నారు. ఇదే పంచాయతీలోని సీబాపుకాలనీ శివారులోని వ్యవసాయ భూములను కొనుగోలు చేసి నిబంధనలు పాటించకుండా ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. ఈ భూములు కాగజ్‌నగర్‌కు కేవలం కిలోమీటరు దూరంలోనే ఉండటంతో పట్టణవాసులు సైతం పోటీపడి కొనుగోలు చేస్తున్నారు.

# శిఖంపై కన్నేసి.. పత్రాలతో కాజేసి..!

మంచిర్యాల : జిల్లా కేంద్రంలో భూముల ధరలు ఆకాశాన్నంటడంతో అక్కడ వాటిని కొనలేని వారు దానిని ఆనుకొని ఉన్న నస్పూర్ పురపాలికపై దృష్టి సారిస్తున్నారు. దీంతో స్థిరాస్తి వ్యాపారులు పురపాలికలో అసైన్డు, చెరువు శిఖం భూముల్లో అక్రమంగా వెంచర్లు వేస్తూ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ప్లాట్లుగా విక్రయిస్తూ ప్రయోజనం పొందుతున్నారు. నీటి పారుదల శాఖ అధికారులు, పురపాలిక అధికారులు, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయ లోపంతో నస్పూర్ చెరువు శిఖం భూములు ఆక్రమణకు గురవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని పెద్ద పురపాలికల్లో నస్పూర్ ఒకటి. ఏడాదంతా సీతారాంపల్లి, నస్పూర్ గ్రామాల ప్రజల నీటి అవసరాలను 144 ఎకరాల విస్తీర్ణం కలిగిన నస్పూరు ఊరు చెరువు తీరుస్తోంది. ఇందులో పెంచే చేపలతో మత్స్యకారులు ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు. వేసవి కాలంలో దీనిలోని నీరే పశువులు, పక్షుల దాహాన్ని తీర్చుతోంది. గ్రామాల్లోని రైతులు ఈ నీటి ఆధారంగానే పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ చెరువు తన ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడింది. చెరువు శిఖం భూములను ఆనుకొని ప్రైవేట్ భూములు ఉండటంతో వాటి సర్వే నంబర్ల ఆధారంగా తప్పుడు పత్రాలతో వీటిని అందులో కలుపుకొని ఆక్రమించుకొనేలా భూబకాసురులు ప్రయత్నిస్తున్నారు. ఇదివరకే 9, 10, 45 సర్వే నంబర్లలో వెంచర్ల ఏర్పాటు ప్రారంభించారు.

సరిహద్దులు ఏర్పాటు చేస్తేనే..నస్పూర్ ఊరు చెరువు శిఖం భూములు కబ్జాకు గురికాకుండా ఉండాలంటే దానికి సంబంధించిన సరిహద్దులను గుర్తించి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కోట్ల విలువ చేసే భూములు అన్యాక్రాంతం కాకుండా నీటి పారుదల శాఖ, పురపాలిక, రెవెన్యూ అధికారులు సమన్వయంతో సర్వే నిర్వహించి వాటిని కాపాడాల్సిన అవసరం ఉంది. జిల్లా పాలనాధికారి ప్రత్యేక చొరవ



తీసుకొని శిఖం భూములు ఆక్రమణలకు గురికాకుండా చూడాలని కోరుతున్నారు. నస్పూర్ పురపాలికలో ప్రభుత్వ, అసైన్డు భూముల్లో అక్రమ వెంచర్లు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. శిఖం భూముల విషయంలో అలా జరగకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉంది.

కట్టడాలు తొలగిస్తాం- కమిషనర్, రాజలింగు చెరువు శిఖం భూమిపై నీటి పారుదల శాఖ అధికారులకు తెలియజేస్తాం. వారి నివేదిక ఆధారంగా కబ్జాకు గురైనట్టు తేలితే కట్టడాలు కూల్చివేస్తాం.

సీతారాంపల్లిలో..సీతారాంపల్లి గ్రామంలోని భీరన్న దేవాలయం ఆనుకొని సర్వే నంబరు 126లో చెరువు శిఖం భూమి ఉంది. గూగుల్ చిత్రంలో ఇది ప్రభుత్వ భూమిగా స్పష్టంగా మ్యాప్ చూపుతోంది. దీని పక్కన సర్వే నంబరు 124 ప్రైవేట్ భూమి ఉండగా.. అదే సర్వే నంబరుతో శిఖం భూమిని ఆక్రమించుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికే ఇక్కడ కొందరు వ్యక్తులు ప్రహరీ నిర్మించి ప్లాంట్లు ఏర్పాటు చేశారు. చెరువు ఆక్రమణలపై 'వరుస కథనాలు రావడంతో స్పందించిన అదనపు పాలనాధికారి మధుసూదన్ నాయక్ గత నెలలో చెరువును సందర్శించారు. శిఖం భూములపై సర్వే చేసి వాటిని ఆక్రమించినట్లు గుర్తిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అయినా భూకబ్జాదారుల అక్రమ నిర్మాణాలు ఆగడం లేదు.

# పాత వంతెనలతో యాతన

నిర్మల్ :జాతీయ రహదారి 61 నిర్మల్-భైంసా ప్రధాన రహదారిపై ఇరవై సంవత్సరాల క్రితం వరద నీటి ఉద్ధృతిని తట్టుకునేలా మాటేగాం, కల్లూరు, వానల్‌పాడ్, చిట్యాల పాత వాటి పక్కనే పైభాగంలో రూ.కోట్లు వెచ్చించి నాలుగు కొత్త వంతెనలను నిర్మించారు. అయితే కొద్ది అడుగుల దూరంలో ఉన్న శిథిలమైన పాతవాటిని తొలగించ లేదు. భారీ వరద నీటి ప్రవాహానికి పాత వంతెనలు అడ్డుకట్టలుగా మారుతున్నాయి.

ఇదీ పరిస్థితి..పాత వంతెనలకు ఎగువ భాగంలో నీరు భారీగా నిలిచి దిగువకు ఉద్ధృతి పెరుగుతోంది. దిగువకు నీరు ఉద్ధృతంగా ప్రవహించడంతో పంట పొలాలు వరద పోటుకు గురై, పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. పొలాల్లో ఇసుక మేటలు, భూములు



కోతకు గురికావడంతోపాటు ఓ పంట కాలం పూర్తిగా నష్టపోవాల్సి వస్తోంది. గత ఏడాది జులై మాసం చివరలో కురిసిన భారీ వర్షాలు అపార నష్టాన్ని కలిగించాయి. అప్పట్లో జిల్లా వ్యాప్తంగా 3.85లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. పంటలు ఆశాజనకంగా ఉన్న తరుణంలో వరద పోటు వల్ల 26,405 మంది రైతులు 28,364 ఎకరాల్లో పంటలు నష్టపోయారని అధికారులు అంచనా వేశారు. ఆ రైతులకు ఇప్పటి వరకు కనీస పరిహారం అందలేదు. వరద ఉద్ధృతి వల్ల రహదారులు సైతం పెద్ద ఎత్తున దెబ్బతింటున్నాయి. బ్రిటిష్ కాలంలో నిర్మించిన పాత వంతెనలను తొలగిస్తే వరద నీరు సాఫీగా దిగువకు వెళ్లేందుకు వీలుపడుతుంది. ఉన్నతాధికారులు, జాతీయ రహదారుల శాఖ స్పందించి చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.

నిర్మించినా ప్రయోజనం శూన్యం..!

పాత వంతెనలతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు విశాలంగా నిర్మించిన కొత్త వాటి వల్ల కొంత మేర ప్రయోజనం చేకూరుతుందని భావించారు. కొత్తగా వంతెనలు నిర్మించినప్పుడు భైంసా-నిర్మల్ రహదారి ఆర్ అండ్ బీ శాఖ పరిధిలో ఉండేది. క్రమంగా జాతీయ రహదారి 61గా మారింది. అయిదారేళ్ల క్రితం రహదారిని అభివృద్ధి చేశారు. కానీ ఇలాంటి పరిస్థితులను అంచనా వేయకుండా పాత వంతెనలు అలాగే ఉంచేశారు. పాతవాటిని తొలగిస్తే రాబోయే వానాకాలంలోనైనా వరదలు వేస్తే కొంత మేర నష్టాన్ని నివారించవచ్చు.

పూర్తిగా నష్టపోయాంసూర్యవంశీ దిగంబర్ పటేల్, రైతు కల్లూరు

గతంలో అనేకమార్లు కురిసిన భారీ వర్షాలు, వరదలకు పంటలు పూర్తిగా నష్టపోయాం. రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోవాల్సిన దుస్థితి నెలకొంది. గత వానాకాలంలో అయిదెకరాల్లో సోయా, ఏడెకరాల్లో పత్తి పంట పూర్తిగా దెబ్బతింది. రెండెకరాల వరి నారు కుళ్లిపోయి పనికి రాకుండా పోయింది. వాగు పరివాహక ప్రాంతంలో ఉండటం వల్ల వ్యవసాయ పనిముట్లు, విద్యుత్తు స్టాటరు డబ్బా, పైపులు సైతం కొట్టుకుపోయాయి. పంటలన్నీ వరద పాలయ్యాయి. వరద ఉద్ధృతికి సారవంతమైన భూమి కోతకు గురై ఇసుక మేటలు వేశాయి.

# రైతు 'బేజారు'!

మంచిర్యాల : వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు సరసమైన ధరలకు అందించటంతో పాటు దళారులు లేకుండా రైతులు నేరుగా పంట ఉత్పత్తులు విక్రయించుకోవడానికి వీలుగా ఆదిలాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన రైతుబజార్‌లో కనీస వసతులు కొరవడ్డాయి. దీంతో వినియోగదారులు, రైతులు, చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. రైతుబజార్‌లో విక్రయాలు చేయటానికి వీలుగా నిర్మించిన గదులు శిథిలమై మందు బాబులు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. రైతులు, వ్యాపారులు రైతుబజార్ కార్యాలయం సమీపంలో, ప్రధాన గేట్ల వద్దనే ప్లాస్టిక్ కవర్లతో డేరాలు ఏర్పాటు వ్యాపారాలు చేస్తున్నారు. ఇక్కడ రెండేళ్ల కిందట ఏర్పాటు చేసిన తాగు నీటి ప్లాంటు నిరుపయోగంగా మారి దాహం వేస్తే కనీసం నీళ్లు లభించని పరిస్థితి. చెత్తను తొలగించకుండా అక్కడే కాల్చి వేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరుగుదొడ్ల నిర్వహణ సైతం సరిగా లేక ఇబ్బందులు తప్పటం లేదు.

నిరుపయోగంగా తాగునీటి ప్లాంట్




ఇది రైతుబజారు వచ్చే వినియోగదారులు, రైతులు, వ్యాపారులకు శుద్ధ జలం అందించడానికి ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటు. దాదాపు రెండున్నరేళ్ల కిందట రూ.2.50 లక్షల వరకు వ్యయం చేసి అక్కడ కొత్తగా బోరు వేసి గదిలో యంత్రాలను ఏర్పాటు చేశారు. కానీ అది ఏనాడూ పని చేయలేదు. ఇక్కడకు వచ్చే వినియోగదారులు, రైతులు, వ్యాపారులు బయటి నుంచి నీళ్లను కొనుగోలు చేసి తాగాల్సి వస్తోంది. రైతుబజార్‌లో ముందు భాగం తప్ప వెనుక వైపున పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదు. అదంతా చెత్తమయంగా మారి పాడుబడిన ఆవరణగా కనిపిస్తోంది. వెనుక వ్యాపారులు, రైతుల కోసం కేటాయించిన గదులు శిథిలావస్థకు చేరాయి. వీటిని కొందరు మందుబాబులు అడ్డాగా మార్చుకొని తాగడం పరిపాటిగా మారింది.

మూత్రశాలలుగా మారిన గదులు

కూరగాయలు, ఇతరత్రా వస్తువులు విక్రయించుకోవడానికి వీలుగా రైతుబజార్‌లో నిర్మించిన పలు గదులు మూత్రశాలలుగా మారిపోయాయి. అక్కడున్న మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవటంతో వినియోగదారులు, రైతులు నిరుపయోగంగా ఉన్న ఈ గదుల్లోనే మూత్ర విసర్జన చేస్తుండటంతో ఆ ప్రాంతమంతా దుర్గంధభరితంగా మారింది.




**హైదరాబాద్: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైకాపా ఎంపీ అవినాష్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిలు పిటిషన్‌పై సీబీఐ కౌంటరు దాఖలు చేసిన విషయం తెలిసిందే. అందులో పలు ఆసక్తికర అంశాలను కేంద్ర దర్యాప్తు సంస్థ పేర్కొంది. నిందితుల మధ్య 2019 మార్చి 14 సాయంత్రం 6 గంటల నుంచి మార్చి 15 ఉదయం 8 గంటల మధ్య సాగిన ఫోన్ కాల్ వివరాలను ప్రస్తావించింది.**




## హోంశాఖపై సమీక్ష.. సీఎం జగన్ కీలక ఆదేశాలు



అమరావతి: సోషల్ మీడియా ద్వారా వేధింపులకు అడ్డుకట్ట పడాలని, దీనిపై ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన హోంశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, సచివాలయాల్లో ఉన్న మహిళా పోలీసులకు కచ్చితమైన ప్రోటోకాల్ ఉండాలన్నారు. మహిళా పోలీసులు ప్రస్తుతం నిర్వహిస్తున్న విధులు, చేపడుతున్న బాధ్యతలపై సమగ్ర సమీక్ష చేయాలని, దీనిలో చేయాల్సిన మార్పులు, చేర్పులపై ఆలోచన చేయాలన్నారు. “దిశ యాప్ మీద మరోసారి డ్రైవ్ నిర్వహించాలి. ప్రతి ఇంట్లో కూడా ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకున్నారా? లేదా? అన్నదానిపై మరోసారి పరిశీలన చేయాలి. దిశ యాప్ వల్ల జరిగే ప్రయోజనాలను వివరిస్తూ ప్రతి ఇంటికీ కరపత్రం ఇవ్వాలి. మాదక ద్రవ్యాలను పూర్తిగా నివారించాలి. రవాణా, పంపిణీ, వినియోగంపై పూర్తిస్థాయిలో ఉక్కుపాదం మోపాలి. డ్రగ్ పెడలర్స్ పట్ల మరింత కఠినంగా వ్యవహరించాలి. వీరికి శిక్షలు పెంచేలా ఆలోచన చేయాలి. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో కూడా ఒక దిశ పోలీస్‌స్టేషన్ ఉండాలి” సీఎం ఆదేశాలు జారీ చేశారు.

## న్యాయవాది సలహా మేరకు లొంగిపోతా: ఎర్ర గంగిరెడ్డి



హైదరాబాద్: సీబీఐ కోర్టులో ఎప్పుడు లొంగిపోవాలనే విషయంపై తన న్యాయవాదితో చర్చిస్తున్నట్లు వివేకా హత్య కేసులో ప్రధాన నిందితుడు ఎర్ర గంగిరెడ్డి తెలిపారు. తన న్యాయవాది సలహా మేరకు లొంగిపోనున్నట్లు చెప్పారు. వివేకా హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎర్ర గంగిరెడ్డి బెయిల్‌ను తెలంగాణ హైకోర్టు రద్దు చేసిన విషయం తెలిసిందే.

గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలంటూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. ఏప్రిల్ 27న బెయిల్ రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. మే 5లోపు సీబీఐ ఎదుట లొంగిపోవాలని ఎర్ర గంగిరెడ్డిని కోర్టు ఆదేశించింది. లొంగని పక్షంలో ఆయన్ను అదుపులోకి తీసుకోవాలని సీబీఐకి సూచించింది. జూన్ 30వ తేదీ వరకు దర్యాప్తునకు గడువు ఉన్నందున అప్పటివరకు మాత్రమే ఎర్ర గంగిరెడ్డిని రిమాండ్‌కు తరలించాలని తీర్పు వెల్లడించిన సమయంలో హైకోర్టు షరతు విధించింది. జూన్ 30 తర్వాత ఎర్ర గంగిరెడ్డికి బెయిల్ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు విధించిన గడువు రేపటితో ముగియనుండడంతో ఈ అంశంపై ఎర్ర గంగిరెడ్డి తన న్యాయవాదితో చర్చిస్తున్నారు. రేపటిలోగా ఎర్ర గంగిరెడ్డి లొంగిపోకపోతే సీబీఐ అరెస్టు చేసే అవకాశం ఉంది.

## సిట్ వ్యవహారంపై కొంత మంది పుడింగులు బయటకు వచ్చి మాట్లాడుతున్నారు.. నాలుగేళ్లలో ఏం పీకారు?



విజయవాడ : సిట్ వ్యవహారంపై కొంత మంది పుడింగులు బయటకు వచ్చి మాట్లాడుతున్నారని వీళ్లు నాలుగేళ్ల నుంచి ఏం పీకారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఒక్క కేసులో కూడా చార్జిషీట్ వేయలేదన్నారు. రేపో ఎల్లుండో ఎంపీ అవినాష్ రెడ్డి అరెస్ట్ ఖాయమన్నారు. 50 మంది ఎమ్మెల్యేలు సీట్లు వద్దంటున్నారన్నారు. ఎమ్మెల్యే లు పారిపోతున్నారని... సమన్వయకర్త లు కాడిపడేస్తున్నారన్నారు. రాజ శ్యామల యాగం చేసే అర్హత ముఖ్యమంత్రి జగన్‌కి లేదని బోండా ఉమ పేర్కొన్నారు. హిందూ మతాన్ని నమ్మేవారే ఆ యాగం చేయాలని బోండా ఉమ పేర్కొన్నారు. జగన్ రెండోసారి ముఖ్యమంత్రి కావటానికి ప్రజల డబ్బుతో రాజ శ్యామల యాగం చేయటం విడ్డూరమన్నారు. వైసీపీ నేతలు యాగం చేయాలంటే వారి సొంత డబ్బుతో చేయాలన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తున్న జగన్ వారి ఆగ్రహానికి గురికాక తప్పదని బోండా ఉమ పేర్కొన్నారు. “జగన్ నేలమాళికల్లో దాచిన డబ్బుని బయటికి తీసి మళ్ళీ ముఖ్యమంత్రి అవ్వాలని చూస్తున్నాడు. జగన్మోహన్ రెడ్డి అవినీతితో సంపాదించిన డబ్బుతో రాజ శ్యామల యాగం చేసుకుంటే మాకు తప్పు లేదు. రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన దేవాలయాలకు సంబంధించిన డబ్బుతో రాజ్యశ్యామల యాగం చేస్తున్నాడు. ఒక తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రెండున్నర కోట్లు తీసుకున్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని లూటీ చేశారు. రాష్ట్రంలో దేవాలయాల సొమ్ముకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఒక పరిరక్షకుడు మాత్రమే. నువ్వు మరోసారి ముఖ్యమంత్రి అవడం కోసం, రాష్ట్రాన్ని దోచుకు తినడానికి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసే అధికారం నీకు ఎవరు ఇచ్చారు? ఏ దేవాలయాల నుంచి అయితే రాజశ్యామల యాగానికి డబ్బులు తెప్పించుకున్నారో అవి వెంటనే వెనక్కి జమ చేయాలి. హిందూ మనోభావాలు దెబ్బతినే విధంగా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారు. అసలు నువ్వు ఏ మతాన్ని ఆచరిస్తావు.. ఎవర్ని పూజిస్తావు? తిరుమల బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి హోదాలో సతీసమేతంగా వెళ్లి బట్టలు ఇస్తారు.. గడచిన నాలుగేళ్లలో ఒక్కసారైనా దంపతులుగా మీరు తిరుమలకు వెళ్లిన దాఖలాలు లేవు. రాష్ట్రంలో ఏ గుడి కూడా సతీసమేతంగా ఎక్కడ వెళ్లలేదు. శారదా పీఠాధిపతి స్వరూపానంద స్వామి చేత ఇటువంటి యాగాల్ని సొంత డబ్బులతో చేయించుకున్నావ్.. ఆ తర్వాత ఆయన్ను కూడా పక్కన పెట్టావు” అని విమర్శించారు.




ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం త్వరలో శుభవార్త చెప్పనున్నట్లు తెలుస్తోంది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వారానికి ఐదు రోజుల పని దినాలను కేంద్ర ఆర్థిక శాఖ అతి త్వరలోనే అమలు చేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా సంస్థల కథనాలు వెల్లడించాయి. ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పనిదినాలను కల్పించేందుకు భారత బ్యాంకుల సంఘం (ఐబీఏ) కేంద్రానికి ఓ ప్రతిపాదన పంపింది. ఈ అంశం చాలాకాలంగా పెండింగ్‌లో ఉండగా.. త్వరలోనే దీనికి ప్రభుత్వం ఆమోదం తెలపనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు వేజ్ బోర్డు సవరణలు చేసి కేంద్ర ఆర్థిక శాఖ నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు సదరు మీడియా కథనాలు తెలిపాయి. కరోనా నేపథ్యంలో వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలని బ్యాంకు ఉద్యోగుల యూనియన్లు డిమాండ్ చేశాయి. అయితే ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) ఇందుకు తిరస్కరించి.. వేతనంలో 19 శాతం పెంచుతామని ఆఫర్ చేసింది. కానీ యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఇందుకు అంగీకరించలేదు. తమకు వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయడంతో పాటు పింఛను, ఇతర డిమాండ్లతో ఈ ఏడాది జనవరిలో రెండు రోజుల సమ్మెకు పిలుపునిచ్చింది. అయితే కొన్ని కారణాల వల్ల ఆ సమ్మెను వాయిదా వేసింది. అనంతరం, ఈ ఏడాది ఫిబ్రవరిలో బ్యాంకు యూనియన్లతో ఐబీఏ చర్చలు జరిపింది. వారానికి ఐదు రోజుల పని విధానం డిమాండ్‌ను తాము పరిగణనలోకి తీసుకుంటామని ఐబీఏ తెలిపింది. అయితే అందుకు బదులుగా ఉద్యోగుల రోజువారీ పనిగంటలను 40 నిమిషాలు పెంచుతామని పేర్కొంది. ఇందుకు బ్యాంకు యూనియన్లు అంగీకరించడంతో.. ఐబీఏ తాజాగా ఐదు రోజుల పనిపై కేంద్రానికి ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. ఒకవేళ ఇది అమల్లోకి వస్తే.. బ్యాంకు ఉద్యోగులు ఇకపై ఉదయం 9.45 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పనిచేయాల్సి వస్తుందని మీడియా కథనాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం బ్యాంకు ఉద్యోగులకు ప్రతినెలా రెండు, నాలుగో శనివారాలు సెలవు దినాలే.




ఇంఫాల్: ఈశాన్య రాష్ట్రం మణిపూర్ హింసాత్మకంగా మారింది. నిరసనకారులు ప్రార్థనా స్థలాలు, వాహనాలను తగలబెట్టడంతో ఈ ఘర్షణలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం ఆర్మీ, అస్సాం రైఫిల్ బలగాలను రంగంలోకి దింపింది. ఈ క్రమంలో ఆర్మీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించింది. మెజార్టీ మైతై (%వీవత్‌వఱ%) కమ్యూనిటీని షెడ్యూల్ తెగలో చేర్చే చర్యలను వ్యతిరేకిస్తూ గిరిజన సంఘాలు చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో ఈ పరిస్థితులు చోటుచేసుకున్నాయి. రాజధాని ఇంఫాల్, చురాచాంద్‌పూర్, కాంగ్‌పోక్పిలో ఘర్షణలు జరగడంతో రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలో కర్ఫ్యూ విధించారు. ప్రభుత్వం ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. ఆర్మీ శిబిరాలు, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో నాలుగువేల మంది ప్రజలకు ఆశ్రయం కల్పించారు. ప్రస్తుతం పరిస్థితులపై ప్రముఖ బాక్సర్ మేరీకోమ్ ట్విటర్ వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. ‘మా రాష్ట్రం మండిపోతోంది. సహాయం చేయండి’ అని ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాను అభ్యర్థించారు. ఈ హింసపై అమిత్ షా.. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌తో మాట్లాడారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కేంద్రం సునిశితంగా గమనిస్తోందని వెల్లడించారు. షెడ్యూల్ తెగ స్టేటస్ కోసం గిరిజనేతర మైతై వర్గం డిమాండ్‌కు వ్యతిరేకంగా ఆల్ ట్రైబల్ స్టూడెంట్ యూనియన్ మణిపూర్ తర్బుంగా ప్రాంతం(చురాచాంద్‌పూర్ జిల్లా)లో ‘గిరిజన సంఘీభావ యాత్ర’కు పిలుపునిచ్చింది. ఈ ర్యాలీలో వేల మంది పాల్గొన్నారు. ఎస్టీ హోదా కోసం మైతే చేసిన డిమాండ్‌కు మణిపూర్ వ్యాలీ ప్రాంతానికి చెందిన చట్టసభ్యుల నుంచి మద్దతు లభించింది. దీంతో గిరిజన ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇది గిరిజనులు, గిరిజనేతరుల మధ్య ఘర్షణకు దారితీసింది. మణిపూర్ జనాభాలో 53 శాతం మంది మైతై వర్గానికి చెందినవారే. మణిపూర్ వ్యాలీలో వారి ప్రాబల్యం ఎక్కువ. బంగ్లాదేశ్, మయన్మార్ నుంచి వస్తోన్న అక్రమ వలసదారులతో తాము సమస్యలు ఎదుర్కొంటున్నామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం రాష్ట్రంలోని పర్వత ప్రాంతాల్లో నివసించేందుకు మైతై వర్గానికి అనుమతి లేదు. మణిపూర్‌లో రెండో అతిపెద్ద పట్టణమైన చురాచాంద్‌పూర్ ఈ ఘర్షణలకు కేంద్ర బిందువుగా మారింది. కొద్దిరోజుల క్రితం ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ పాల్గొనాల్సిన సభకు చెందిన వేదికను ఆ ప్రాంతంలో నిరసనకారులు దహనం చేసిన సంగతి తెలిసిందే.




**కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గాడిమొగ పంచాయతీ పరిధిలోని చినవలసలలో కురిసిన భారీ వర్షానికి జగనన్న కాలనీ నీట మునిగింది. పెద్ద ఎత్తున వరద నీరు అక్కడికి చేరుకోవడంతో ఆ ప్రాంతమంతా నదిని తలపిస్తోంది.**



## పోరాటాల పురిటగడ్డ బొల్లవరంలో పాదయాత్ర చెయ్యడం నా అదృష్టం



కర్నూలు : నేడు టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్రను కర్నూలు జిల్లా పాన్యం నియోజక వర్గం బొల్లవరంలో నిర్వహిస్తున్నారు. నేడు ఆయనను బొల్లవరం గ్రామస్తులు కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ. పోరాటాల పురిటగడ్డ బొల్లవరంలో పాదయాత్ర చెయ్యడం తన అదృష్టమని అన్నారు. ఉద్యమ వీరులకు జోహార్లు తెలిపారు. టీడీపీ అధికారలోకి వచ్చిన వెంటనే బొల్లవరం గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి అందిస్తామని నారా లోకేష్ వెల్లడించారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో శ్మశానాలకు కూడా రక్షణ లేకుండా పోయిందన్నారు. వైసీపీ నాయకులు శ్మశానాలను కూడా వదలకుండా ఆక్రమిస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రహరీగోడలు నిర్మించి శ్మశానాలు ఆక్రమణలకు గురి కాకుండా చూస్తామన్నారు. చెత్త వేసేందుకు డంపింగ్ యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని నారా లోకేష్ పేర్కొన్నారు.

# పసుపువర్ణం.. 'వెన్నెల' అరవిందం..!

చంకీల అంగీలేసి అంటూ దసరా సినిమాలో వెన్నెల పాత్రలో ఇది నా స్టామినా అంటూ మరోసారి తన అభినయంతో మెప్పించింది కీర్తి సురేష్. మహానటి తర్వాత ఆ రేంజ్ నటనకు స్కోప్ ఉన్న పాత్ర పడలేదు. తమిళ్ లో ఒకటి రెండు సినిమాలు అలాంటివి పడినా లాభం చేకూరలేదు. ఫైనల్ గా దసరాతో మరోసారి కీర్తి అంటే ఏంటో చూపించింది. బరాత్ లో ఆమె చేసిన డ్యాన్స్ కి రీల్స్ అయితే లక్షల్లో చేస్తున్నారు. కొత్త దర్శకుడు కాబట్టి ఏదో నాని చెప్పాడని ఇష్టం లేకుండానే దసరా సినిమా చేసింది కీర్తి సురేష్. ఇక సినిమా రిజల్ట్ చూశాక సర్ ప్రైజ్ అయ్యింది. ఈమధ్య తన గ్లామర్ సైడ్ చూపించేందుకు ఆరాటపడుతున్న కీర్తి మరోసారి మహానటి లాంటి అభినయంతో మెప్పించడం ఆమె ఫ్యాన్స్ ని అలరించింది. దసరా



ఇచ్చిన జోష్ తో కీర్తి సురేష్ ఇలాంటి ఛాలెంజింగ్ రోల్స్ మరెన్నో చేయాలని ఆశిస్తున్నారు. సినిమాలతో పాటుగా సోషల్ మీడియాలో తన ఫోటో షూట్స్ తో కూడా మంచి ట్రీట్ అందిస్తుంది కీర్తి సురేష్. లేటెస్ట్ గా అమ్మడు పసుపు రంగు డ్రెస్ లో క్యూట్ లుక్స్ తో అదరగొడుతుంది. పసుపు వర్ణంలో వెన్నెల అరవిందం అంటూ కీర్తి లుక్స్ పై క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. తెలుగులో ఆమెకు క్రేజీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉండగా సెలెక్టెడ్ సినిమాలను మాత్రమే చేస్తుంది. పోటీగా ఎంతమంది భామలు ఉన్నా నటిగా తన స్పెషాలిటీ చాటుకుంటూ వస్తుంది కీర్తి సురేష్. ఫోటో షూట్స్ తొ కూడా అంతే క్రేజ్ తెచ్చుకుంటుంది. లేటెస్ట్ గా యెల్లో కలర్ డ్రెస్ తో తన ఫ్యాన్స్ ని అలరించింది కీర్తి సురేష్. చిరుతో భోళా శంకర్ లో సిస్టర్ రోల్ లో నటిస్తుంది కీర్తి. మెగాస్టార్ కి చెల్లెలిగా అంటే కెరీర్ పరంగా రిస్క్ అని అనుకున్నారు కానీ హీరోయిన్ అన్న తర్వాత ఎలాంటి పాత్ర అయినా చేయాలి అందుకే చిరు సినిమాకు ఆయన సోదరిగా ఓకే చెప్పింది. మెహర్ రమేష్ డైరెక్షన్ లో వస్తున్న ఈ సినిమా ఈ ఏడాది సెకండ్ హాఫ్ లో రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు.

# మళ్లీ మొత్తం బటన్స్ విప్పేసి చూపిస్తోంది

నందమూరి బాలకృష్ణ సూపర్ హిట్ చిత్రం లెజెండ్ లో హీరోయిన్ గా నటించిన సోనాల్ చౌహాన్ కి మంచి గుర్తింపు దక్కింది. అయితే ఆమెకి అదృష్టం కలిసి రాకపోవడం వల్ల ఆ తర్వాత చేసిన సినిమాలు నిరాశ పరిచి.. తక్కువ సమయంలోనే అవకాశాలు తగ్గాయి. టాలీవుడ్ లో ఆఫర్లు రాకున్నా కూడా హిందీ మరియు ఇతర భాషల్లో సినిమాలు చేస్తూ కెరీర్ ను నెట్టుకు వస్తుంది. చిన్న గ్యాప్ తర్వాత తెలుగు లో ఎఫ్ 3 సినిమాని చేసిన విషయం తెల్సిందే. ఆ తర్వాత ది ఘోస్ట్ సినిమాను కూడా సోనాల్ చౌహాన్ చేసింది. ఆ రెండు సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచాయి. దాంతో సోనాల్ చౌహాన్ కి మళ్లీ అవకాశాల కోసం వెయిట్ చేయాల్సి వచ్చింది. ఈ సమయంలోనే



ఈ అమ్మడు సోషల్ మీడియాలో చేస్తున్న రచ్చ అంతా ఇంత కాదు. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోలు వైరల్ అవుతూనే ఉన్నాయి. ఇటీవలే షర్ట్ బటన్స్ విప్పి క్లీ వేజ్ అందాలని చూపిస్తూ నడుము నాభి అందాలను తెగ ఎక్స్ పోజ్ చేసిన విషయం తెల్సిందే. ఏమాత్రం గ్యాప్ ఇవ్వకుండా వెంటనే అదే విధంగా షర్ట్ బటన్ విప్పి క్లీ వేజ్ షో తో మతి పోగొట్టింది. బ్లాక్ షేడ్స్ ను ధరించి.. జీన్స్ టాప్ ధరించి.. ఆ టాప్ యొక్క అన్ని బటన్స్ ను విప్పేసి క్లీ వేజ్ షో తో పాటు ఎద అందాలను చూపిస్తూ మతి పోగొడుతోంది. ఈ స్థాయి లో అందాల ఆరబోత చేసినా కూడా పాపం ఈమెను పట్టించుకోవడం లేదు అంటూ చాలా మంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక ముందు అయినా సీనియర్ హీరోలు ఈమెను కాస్త పట్టించుకోవాలని ఈమె అభిమానులు కోరుకుంటున్నారు.





# క్లీవేజ్ లుక్ లో అదరగొట్టిన రెడ్ పిల్ల..!



సినిమాల్లో హీరోయిన్ గా అవకాశం రావడానికి అందంగా ఉంటే సరిపోతుంది. కానీ ఆ తర్వాత హిట్లు పడాలి అంటే కాస్తయినా లక్ ఉండాల్సిందే. ఈ హాట్ బ్యూటీ మాళవిక శర్మ విషయంలోనూ అదే జరుగుతోంది. నిండు చందమామ లాంటి అందం ఆమె సొంతమైనా అవకాశాలు హిట్లు మాత్రం పడటం లేదు. వరసగా కొన్ని అవకాశాలు వచ్చినా అవి విజయం సాధించకపోవడంతో డీలా పడిపోతోంది. తనకు అందం టాలెంట్ ఉన్నా అదృష్టం కలిసిరాక ఇబ్బందిపడుతుంది. సరైన హిట్ ఒక్కటి పడితే టాలీవుడ్ కి మంచి హీరోయిన్ దొరికినట్లే. అలాంటి అదృష్టం కోసం ఎదురుచూస్తున్న కథానాయికల జాబితాలో మాళవిక శర్మ పేరు కూడా ముందువరుసలోనే ఉంటుంది. మాళవిక చూడటానికి ఇప్పుడే విరబూజిన లేత గులాబి పువ్వులా ఉంటుంది. చూడగానే ఆకర్షించే రూపుతో ఇట్టే కట్టిపడేస్తుంది. సినిమాలు రాకపోతేనేం ఈ బ్యూటీ సోషల్ మీడియాను మాత్రం వదిలిపెట్టడం లేదు. అక్కడ తన అంద చందాలను ఎరగా వేస్తూ కుర్రాళ్ల మతి చెడగొడుతోంది. తాజాగా నో మేకప్ లుక్ తో మరోసారి ఆకట్టుకుంది. మేకప్ లేకుండా ఎలాంటి ఫిల్టర్స్ లేకుండా క్లీవేజ్ లుక్ లో ఈ బ్యూటీ ఇచ్చిన ఫోజులకు ఎవరైనా ఫిదా అయిపోవాల్సిందే. మేకప్ లేకుండానే ఇంత అందమా అంటూ అందరూ ఆశ్చర్యపోతున్నారు. తెలుగులో మాస్ మహారాజా రవితేజతో నేల టికెట్ సినిమాలో హీరోయిన్గా ఎంట్రీ ఇచ్చింది మాళవిక శర్మ. కానీ ఆ సినిమా రవితేజ కెరీర్ లో అట్టర్ ఫ్లాప్ అయ్యింది. ఆ ఎఫెక్ట్ మాళవికపై కూడా పడింది. అయినా తర్వాత రామ్ పోతినేని రెడ్ సినిమాలలో అవకాశం దక్కించుకుంది. అది కూడా ఆశించని ఫలితం ఇవ్వలేదు. ఆ సినిమా కనుక హిట్ అయ్యి ఉంటే ఇప్పుడు మాళవిక కెరీర్ మరోలా ఉండేది. తాజాగా సల్మాన్ ఖాన్ కిసీ కా భాయ్ కీసీకీ జాన్ లో నటించింది. అది కూడా పెద్దగా ఆకట్టుకున్నది లేదు. అంతక ముందు కాఫీ విత్ కాదల్ అనే సినిమాలో నటించింది. కానీ ఆ సినిమా కూడా జనాలకు రీచ్ అవ్వలేదు. మరి ఈ ముద్దుగుమ్మ అందాలు చూసైనా దర్శకనిర్మాతలు మరొక్క ఛాన్స్ ఇస్తే తానేంటో నిరూపించుకుంటుందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. మరి ఆ అవకాశం ఎప్పుడు వస్తుందో చూడాలి.

# దివి అందాల విందు..తట్టుకోవడం కష్టమే..!



యువనటి దివి.. ఈ కాలం యువతకు పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఎప్పుడైతే బిగ్ బాస్ లో అడుగుపెట్టిందో ఆమె అందం చూసి కుర్రాళ్లు మెస్మరైజ్ అయ్యారు. ఆ షోలో దివి పొట్టి దుస్తులు చీరలు ధరించి కుర్రాళ్లను ఆకర్షించేసింది. అంతేనా అక్కడి నుంచి వచ్చిన తర్వాత ఆఫర్లు కూడా ఆమెకు క్యూ కడుతున్నాయి. నిజానికి అంతక ముందు కూడా పలు సినిమాల్లో నటించినప్పటికీ పెద్దగా గుర్తింపు రాలేదు. కానీ ఎప్పుడైతే బిగ్ బాస్ కి వెళ్లిందో ఆమె అందానికి ప్రేక్షకులు ముగ్దులైపోయారు. అప్పటి నుంచి ఆమెకు సోషల్ మీడియాలో క్రేజ్ మరింత పెరిగిపోయింది. ఆ తర్వాత పాపకు సినిమా ఛాన్స్ లు కూడా పెరిగాయనే చెప్పొచ్చు. ఇక అసలు విషయానికి వస్తే దివి సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఫోటోలకు ఫోజులిచ్చి వాటిని షేర్ చేస్తూ ఉంటుంది. ఇటీవల తన పుట్టినరోజు నాడు సాగరకన్యలా ముస్తాబై దర్శనమిచ్చి అందరినీ ఆకట్టుకుంటుంది. తాజాగా లంగా జాకెట్ వేసుకొని ఫోజులు లేటెస్ట్ ఫోటో షూట్ లో చీర లేకుండా నడుము వంపులు చూపించింది. నేలపై పడుకొని రెచ్చగొట్టే కామెంట్స్ పెట్టింది. చూసి మొదటి నిమిషంలోనే ప్రేమ అవ్వకపోతే అది ప్రేమ ఎలా అవుతుంది? అని నెటిజెన్స్ ని ప్రశ్నించింది. ఈ ఫోజులకు నెటిజన్లు ఫిదా అయిపోయారు. ఇంత అందం తట్టుకోవడం తమ వల్ల అవుతుందా అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. కొందరు నెగిటివ్ గా కూడా కామెంట్స్ చేయడం గమనార్హం. అందం అంటే.. ఎక్స్ ఫోజింగ్ కాదు చూడగానే అందంగా ఉన్నారు అనిపించే భావన కలగాలి అంటూ నెగిటివ్ కామెంట్స్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా దివి కి ఈ మధ్య సిల్వర్ స్క్రీన్ మీద ఆఫర్స్ పెరిగాయి. అలాగే డిజిటల్ సిరీస్లలో సందడి చేస్తున్నారు. ఇటీవల ఆమె కీలక రోల్ చేసిన ఏటిఏం అనే వెబ్ సిరీస్ విడుదలైంది. అలాగే కొన్ని డిజిటల్ ప్రాజెక్ట్స్ ఆమె చేతిలో ఉన్నాయి. గత ఏడాది విడుదలైన జిన్నా మూవీలో దివి ప్రాధాన్యత ఉన్న పాత్ర చేశారు. మూగ అమ్మాయి అయిన హీరో ఫ్రెండ్ పాత్రలో మెప్పించారు. స్టార్ హీరోలో సినిమాల్లో చిన్న చిన్న రోల్స్ చేస్తోంది. ఇటీవల చిరంజీవి గాడ్ ఫాదర్ సినిమాలో దివికి మంచి పాత్రే దక్కిందని చెప్పాలి. ఇటీవల పుష్ప2 లోనూ రిపోర్ట్ గా కనిపించనుంది. ఇటీవల రిలీజ్ చేసిన టీజర్ లో అలా తళుక్కున మెరిసింది. ఇలా పలు సినిమాల్లో ఛాన్స్ లు దక్కించుకుంటూ క్రేజ్ పెంచుకుంటోంది. ఈ అమ్మడుకి సినిమాల్లో కంటే సోషల్ మీడియాలోనే క్రేజ్ ఎక్కువ అని చెప్పాలి.

# అనుష్క.. ఈ క్రేజ్ ని ఎలా మిస్ అవ్వాలనిపిస్తుంది..?

స్వీటీ అనుష్కకి తెలుగులో ఎంత ఫాలోయింగ్ ఉంది అన్నది అందరికీ తెలిసిందే. సూపర్ సినిమాతో పరిచయమైన బ్యూటీ 18 ఏళ్ల తన సినీ ప్రయాణంలో వెనక్కి తిరిగి చూసుకున్నది లేదని చెప్పొచ్చు. అప్పటివరకు స్టార్ సినిమాల్లో నటిస్తూ స్టార్ ఇమేజ్ తెచ్చుకున్న అనుష్క అరుంధతి సినిమాతో ఫీమేల్ సెంట్రిక్ సినిమాలకు సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. అనుష్క అసలు స్టామినా ఏంటి అన్నది అరుంధతి నుంచి అర్థమైంది. అప్పటి నుంచి లేడీ ఓరియెంటెడ్ సినిమాలంటే అనుష్క అనేలా పేరు తెచ్చుకుంది. రుద్రమదేవితో కూడా ఆమె సూపర్ అనిపించుకుంది. బాహుబలి తర్వాత చాలా గ్యాప్ ఇచ్చి నిశ్శబ్ధం చేసిన అనుష్క ఆ సినిమా తో అపజయాన్ని మూట



కట్టుకుంది. అయితే మళ్లీ మూడేళ్లు గ్యాప్ ఇచ్చిన ఈ అమ్మడు ఫైనల్ గా మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమాలో కనిపించింది. ఏజెంట్ ఆత్రేయ జాతిరత్నాలు రెండు సినిమాలతో సూపర్ హిట్ అందుకున్న నవీన్ పొలిశెట్టి ఏకంగా అనుష్క తో జత కట్టే సినిమా చేస్తున్నాడు. బ్యాక్ టు బ్యాక్ హిట్లు పడటంతో అతని మీద మరింత అంచనాలు ఏర్పడ్డాయి. మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి తో నవీన్ పొలిశెట్టి కామెడీ ఇంప్రెస్ చేసేలా ఉంది. లేటెస్ట్ గా ఈ సినిమా నుంచి ఒక టీజర్ వదలగా కొద్ది గంటల్లోనే మిలియన్ల కొద్దీ వ్యూస్ రాబట్టింది. అనుష్కకి ఆడియన్స్ లో ఉన్న క్రేజ్ అలాంటిది. తనకు ఉన్న ఫాలోయింగ్ గురించి తెలిసి.. తను సినిమా చేయాలని ఫ్యాన్స్ కోరుతున్నారని తెలిసి కూడా ఇన్నాళ్లు సినిమాలకు ఎందుకు దూరంగా ఎలా ఉండగలిగింది అంటూ మాట్లాడుకుంటున్నారు. ఇంత మంది అభిమానుల ప్రేమను.. ఈ క్రేజ్ ని అనుష్క ఎలా మిస్ అవ్వాలనిపిస్తుంది అంటూ కామెంట్స్ చేస్తున్నారు. అనుష్క సినిమాలో ఉంది అంటే కంటెంట్ కాస్త బాగుంది అంటే సినిమా పక్కా హిట్ అన్నట్టే లెక్క. బాహుబలిలో డీ గ్లామర్ రోల్ చేసినా అనుష్క కాబట్టే యాక్సెప్ట్ చేశారని చెప్పొచ్చు. మరి మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి తర్వాత అయినా అనుష్క వరుస సినిమాలు చేస్తుందా లేదా అన్నది చూడాలి.

# ముక్కుకు ముక్కెరతో ఎద అందాలను ఎరవేస్తున్న నభ..!

నభానటేష్..అందం నటన కలబోసినట్లుగా ఉంటుంది. ఈ అమ్మాయి చాలా యాక్టివ్ గా ఉంటుంది. అందం రాసులు పోసినట్లుగా ఉంటుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఈ పిల్లను చూసి అందరికీ ముచ్చటపడ్డారు. మంచి భవిష్యత్తు ఉందని అనుకున్నారు. వరస అవకాశాలతో టాలీవుడ్ ని ఏలేస్తుంది అనుకున్నారు. కానీ పాపం లక్ కలిసిరాలేదు. దీంతో అవకాశాలు కరువయ్యాయి. నిజానికి నభా కెరీర్ లో ఇస్మార్ట్ శంకర్ మాస్ట్రో సోలో బతుకే సో బెటర్ లాంటి బ్లాక్ బస్టర్ హిట్లు ఉన్నాయి. వీటితోపాటు మరి కొన్ని మంచి సినిమాల్లోనూ నటించింది. కానీ ఎందుకో స్టార్ హీరోల సరసన నటించే అవకాశం రాలేదు. దానికి కూడా కారణం లేకపోలేదు. అనుకోకుండా ఓ రోడ్డు ప్రమాదానికి గురవ్వడం ఆమెకు అవకాశాలు చేజారేలా చేసింది. అందుకే ఇప్పుడు పెద్దగా కనిపించడం లేదు. అయినా ఈ బ్యూటీ ఫ్యాన్స్ ని మాత్రం



ఏ మాత్రం నిరుత్సాహపరచడం లేదు. సినిమాల్లో కనిపించకుంటే ఏంటి? సోషల్ మీడియాని తన ఫోటోషూట్ లతో షేక్ చేస్తోంది. కొంతకాలం సోషల్ మీడియాకు కూడా దూరమైన ఆ బ్యూటీ ఇప్పుడు మళ్లీ తన అందంతో యుద్ధం ప్రకటిస్తోంది. నిజానికి నభా నడుము కొలతలకు ఆమె ఓరచూపులకు యూత్ లో చాలా ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అందుకే అలా సోషల్ మీడియాలో ఫోటోలు షేర్ చేస్తే ఇలా వైరల్ అయిపోతాయి. తాజాగా ఈ హాట్ బ్యూటీ లెహంగాలో మెరిసింది. ముక్కుకు ముక్కర ఆమెకు మరింత అందాన్ని తీసుకువచ్చింది. కొద్దిగా లైట్ కలర్ లెహంగా కి రెడ్ కలర్ చోళీ కాంబినేషన్ అదే రంగు ఓణి మ్యాచ్ చేసింది. ఈ దుస్తుల్లో నభా ని చూడటానికి రెండు కళ్లు సరిపోవు అనడంలో ఏమాత్రం అతిశయోక్తి కాదు. అక్కడితో ఆగలేదు. ఆ డ్రెస్ లో తన నడము అందాలతో పాటు తన ఎద అందాలను కూడా ఎర వేసింది. ఆ చూపులకు సోకులకు ఎవరైనా ఫిదా అయిపోవాల్సిందే. మీరు కూడా ఆ ఫోటోలపై ఓ లుక్కేయండి. కాగా నభా నటేష్ నన్ను దోచుకుందువటే సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయ్యింది. ప్రస్తుతం .. ఎన్టీఆర్ కొరటాల శివ సినిమాలో రెండో హీరోయిన్గా నటించబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. వాటితో పాటు ప్రభాస్ 'రాజా డీలక్స్' .. రామ్ చరణ్ నెక్స్ట్ ప్రాజెక్ట్లోఈ భామను తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారట. దీనిపై అదికారిక ప్రకటన రావాల్సి ఉంది.






# ఢిల్లీలో బీఆర్ఎస్ భవన్‌ను ప్రారంభించిన పార్టీ అధినేత కేసీఆర్

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలోని వసంత్ విహార్‌లో నూతనంగా నిర్మించిన బీఆర్ఎస్ భవన్‌ను ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం మధ్యాహ్నం ప్రారంభించారు. భవనం ప్రారంభోత్సవానికి ముందు అక్కడ నిర్వహించిన సుదర్శన పూజ, హోమం, వాస్తు పూజల్లో కేసీఆర్ పాల్గొన్నారు. ఆ తర్వాత భవన్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు కేసీఆర్. అనంతరం మ. 1:05 గంటలకు రిబ్బన్ కట్ చేసి భవన్‌లోకి ప్రవేశించారు కేసీఆర్. భవన్‌లో దుర్గామాత అమ్మవారికి కేసీఆర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భవనంలోని మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన తన ఛాంబర్‌కు కేసీఆర్ వెళ్లి కుర్చీలో ఆసీనులయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మరికాసేపట్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో కేసీఆర్ తొలి సమావేశం నిర్వహించనున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎంపీలు కేశవరావు, వెంకటేశ్ నేత, సంతోష్ కుమార్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బీఆర్ఎస్ భవన్ ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగింది. ఢిల్లీ వసంత్ విహార్‌లో బీఆర్ఎస్ ఆఫీసు నిర్మాణానికి 2021, సెప్టెంబర్ 2న సీఎం కేసీఆర్ భూమి పూజ చేశారు. మొత్తం నాలుగు అంతస్థులతో 11 వేల చదరపు అడుగుల స్థలంలో దీనిని నిర్మించారు. లోయర్‌గ్రౌండ్‌లో మీడియా హాల్, సర్వెంట్ క్వార్టర్స్ ఉన్నాయి. ఇక గ్రౌండ్‌ఫ్లోర్‌లో క్యాంటీన్, రిసెప్షన్ లాబీ, 4 ప్రధాన కార్యదర్శుల చాంబర్‌లు, మొదటి అంతస్థులో బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు కేసీఆర్ చాంబర్, ఇతర చాంబర్స్, కాన్ఫరెన్స్ హాల్స్, 2వ, 3వ అంతస్థుల్లో మొత్తం 20 గదులు ఉన్నాయి. వీటిలో పార్టీ ప్రెసిడెంట్ సూట్, వర్కింగ్ ప్రెసిడెంట్ సూట్‌పోగా మిగతా 18 ఇతర రూములు అందుబాటులో ఉంటాయి.

# ఢిల్లీ బీఆర్ఎస్ భవన్‌లో మంత్రి కేటీఆర్ సందడి..



న్యూఢిల్లీ : ఢిల్లీ బీఆర్ఎస్ భవన్‌కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ గురువారం మధ్యాహ్నం చేరుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు పార్టీ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఇక భవనంలోని ఓ అంతస్తులో అమ్మవారి విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి కేటీఆర్ ఫోటోలు దిగారు. పలువురు నాయకులు కేటీఆర్‌తో సెల్ఫీలు తీసుకున్నారు. దేశ రాజధానిలో పార్టీ కార్యాలయం.. ప్రతి ఒక్క గులాబీ సైనికుడికి గర్వకారణం: ఎమ్మెల్సీ కవిత దేశ రాజధాని ఢిల్లీలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించుకోవడం ప్రతి ఒక్క గులాబీ సైనికుడికి గర్వకారణమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సీఎం కేసీఆర్ దూరదృష్టి, పట్టుదల, నిబద్ధత బీఆర్ఎస్ పార్టీని ఉన్నత స్థానానికి తీసుకెళ్లాయని చెప్పారు.

# దేశ రాజధానిలో పార్టీ కార్యాలయం.. ప్రతి ఒక్క గులాబీ సైనికుడికి గర్వకారణం: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్: దేశ రాజధాని ఢిల్లీలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించుకోవడం ప్రతి ఒక్క గులాబీ సైనికుడికి గర్వకారణమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సీఎం కేసీఆర్ దూరదృష్టి, పట్టుదల, నిబద్ధత బీఆర్ఎస్ పార్టీని ఉన్నత స్థానానికి తీసుకెళ్లాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా ప్రారంభమైన బీఆర్ఎస్ పార్టీ అనేక రాజకీయ ఒడిదుడుకులను తట్టుకొని, ప్రతి ఒక్క పౌరుడి మద్దతుతో లక్ష్యాన్ని సాధించిందని తెలిపారు. సీఎం కేసీఆర్ రాజనీతిజ్ఞతతో ఏర్పడిన తెలంగాణ ఈరోజు అభివృద్ధిలో దూసుకెళు తున్నదని చెప్పారు. తొమ్మిది మంది లోక్‌సభ ఎంపీలు, ఏడుగురు రాజ్యసభ ఎంపీలు, 105 మంది ఎమ్మెల్యేలతో బీఆర్ఎస్ పార్టీ జాతీయస్థాయిలో కీలక పార్టీగా ఎదిగిందని ట్వీట్ చేశారు. 'తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా ప్రారంభమైన బీఆర్ఎస్ పార్టీ అనేక రాజకీయ ఒడిదుడుకులను తట్టుకొని, ప్రతి ఒక్క పౌరుడి మద్దతుతో లక్ష్యాన్ని సాధించింది. కేసీఆర్ నిబద్ధతను మెచ్చి ప్రత్యేక తెలంగాణకు 39 రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చాయి. సీఎం కేసీఆర్ రాజనీతిజ్ఞతతో ఏర్పడిన తెలంగాణ ఈరోజు అభివృద్ధిలో దూసుకెళ్తున్నది. 9 మంది లోక్‌సభ ఎంపీలు, ఏడుగురు రాజ్యసభ ఎంపీలు, 105 మంది ఎమ్మెల్యేలతో బీఆర్ఎస్ పార్టీ జాతీయస్థాయిలో కీలక పార్టీగా ఎదిగింది. దేశ రాజధాని ఢిల్లీలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించుకోవడం ప్రతి ఒక్క గులాబీ సైనికుడికి గర్వకారణం. ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టి, పట్టుదల, నిబద్ధత బీఆర్ఎస్ పార్టీని ఉన్నత స్థానానికి తీసుకెళ్లాయి.' అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ట్విట్టర్ వేదికగా పోస్టు చేశారు.

# మావోయిస్టు కదలికలపై నిరంతరం అప్రమత్తత అవసరం : డీజీపీ అంజనీ కుమార్



హైదరాబాద్ : రాష్ట్రంలో ఏ ఒక్క చిన్న సంఘటన జరిగినా అది తెలంగాణా రాష్ట్ర అభివృద్ధి పై తీవ్ర ప్రభావం చూపిస్తుందని, ఈపరిస్థితుల్లో పోలీస్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని డీజీపీ అంజనీ కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. దక్షిణ బస్తర్‌లోని అరుణపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏప్రిల్ 26న జరిగిన మందుపాతర పేలుడులో 10 మంది భద్రతా సిబ్బందితోపాటు ఒక పౌరుడు మరణించిన సంఘటన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాల పోలీస్ అధికారులతో డీజీపీ గురువారం తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ ప్రముఖులు, వీవీఐపీల పర్యటన సమయంలో భద్రతా బలగాలు సంచరించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇదే సమయంలో రాష్ట్రాల సరిహద్దుల ప్రాంతాల్లో మావోయిస్టుల యాక్షన్ టీంల కదలికలు పెరిగే అవకాశం ఉందన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఐటీ పరిశ్రమలు, అనేక బహుళజాతి సంస్థలు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఏ చిన్న సంఘటన జరిగినా అంతర్జాతీయంగా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. మావోయిస్టులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని, ఒకర్ని దెబ్బతీయడం వల్ల వేలాది మందిని భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరిస్తున్నారన్నారు. పోలీస్ శాఖ నిరంతర కృషే వల్ల తెలంగాణలో వామపక్షతీవ్రవాదం పూర్తిగా అంతరించిపోయిందని పేర్కొన్నారు.

ఇప్పటి వరకు తెలంగాణ ప్రాంతంలో 96 ల్యాండ్‌మైన్ అమర్చిన, పేలుడు ఘటనలు వెలుగుచూశాయని చెప్పారు. మావోయిస్టు చర్యలకు సంబంధించిన కీలక దాడుల్ని ఈ సందర్భంగా డీజీపీ అధికారులకు వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో అడిషనల్ డీజీ గ్రేహౌండ్స్ విజయ్ కుమార్, అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్, ఐజీ ఎస్ఐబీ ప్రభాకర్ రావు, ఐజీలు చంద్రశేఖర్ రెడ్డి, షానవాజ్ ఖాసీం ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బల్కంపేట ఎల్లమ్మకు 2.20 కిలోల బంగారు కిరీటం: మంత్రి తలసాని



హైదరాబాద్: జూన్ 20న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఎల్లమ్మ తల్లికి బంగారు కిరీటం సమర్పించనున్నామని తెలిపారు. ఆలయ ప్రధాన ద్వారాలకు వెండి తాపడం చేయిస్తామన్నారు. హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద దాతల సహకారంతో నిర్మించిన 34 షాపులను మంత్రి తలసాని ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారని చెప్పారు. చిరు వ్యాపారులకు షాపులను ఉచితంగా కేటాయించామని వెల్లడించారు. భక్తులు మొక్కుల రూపంలో చెల్లించుకున్న బంగారంతో అమ్మవారికి ఆభరణాలు చేయిస్తున్నామని తెలిపారు. ఇలా 2.20 కిలోల బంగారంతో కిరీటం, ఇతర ఆభరణాలు తయారయ్యాయని మంత్రి తలసాని చెప్పారు.

దిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న రెజ్లర్ల దీక్షా శిబిరం వద్ద బుధవారం అర్ధరాత్రి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. పోలీసులు, రెజ్లర్ల మధ్య ఘర్షణ జరిగి పలువురు గాయపడ్డారు. నిరసనకారుల కోసం ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే సోమ్‌నాథ్ భారతి తీసుకొచ్చిన మంచాలు ఈ ఉద్రిక్తతలకు తెరలేపాయి. అసలేం జరిగిందంటే.. దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న రెజ్లర్ల కోసం ఎమ్మెల్యే సోమ్‌నాథ్ భారతి బుధవారం రాత్రి మడత మంచాలు తీసుకొచ్చారు. అయితే వాటిని రెజ్లర్లకు ఇచ్చేందుకు పోలీసులు అనుమతించలేదు. దీంతో సోమ్‌నాథ్ అనుచరులు వాగ్వాదానికి దిగారు. వీరికి రెజ్లర్లకు కూడా తోడవడంతో పోలీసులు, ఆందోళనకారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. కొందరు పోలీసులు మద్యం మత్తులో తమపై దాడికి పాల్పడ్డారని రెజ్లర్లు ఆరోపిస్తున్నారు. "వర్షాల కారణంగా మా పరుపులు తడిచిపోయాయి. అందుకే మడత మంచాలు తీసుకోవాలని అనుకున్నాం. కానీ పోలీసులు అనుమతించలేదు. కొందరు పోలీసులు మద్యం మత్తులో మహిళా రెజ్లర్లను అవమానించేలా మాట్లాడారు. మాపై దాడి చేశారు. ఈ ఘటనలో భజ్‌రంగ్ పునియా బావ దుష్యంత్, మరో ఇద్దరు గాయపడ్డారు" అని మాజీ రెజ్లర్ రాజ్‌వీర్ ఆరోపించాడు. అటు భజ్‌రంగ్ పునియా భార్య సంగీత ఫొగాట్, వినేశ్ ఫొగాట్ కూడా ఇదే విధమైన ఆరోపణలు చేశారు. మహిళా పోలీసులు లేరని, కొందరు పోలీసులు తమను తోసేశారని తెలిపారు.

అయితే, ఈ ఆరోపణలను పోలీసులు ఖండించారు. మడత మంచాలు ఇచ్చేందుకు అనుమతి లేదని చెప్పడంతో ఎమ్మెల్యే అనుచరులు వాగ్వాదానికి దిగారని, దీంతో చిన్నపాటి ఘర్షణ జరిగిందని సీనియర్ పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. అయితే, పోలీసులు మద్యం సేవించారన్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. ఆందోళనకారులపై పోలీసులు దాడి చేయలేదన్నారు. ప్రస్తుతం జంతర్‌మంతర్ వద్ద పరిస్థితి నియంత్రణలోనే ఉందని తెలిపారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.

**ఇందుకోసమేనా మేం పతకాలు గెలిచింది..** తాజా ఘర్షణపై స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ తీవ్ర ఉద్వేగానికి గురైంది. ఇలాంటి రోజును చూసేందుకేనా తాము పతకాలు సాధించిందంటూ కన్నీళ్లు పెట్టుకుంది. "మేం క్రిమినల్స్ కాదు. కానీ పోలీసులు మమ్మల్ని అలాగే పరిగణిస్తున్నారు. నన్ను వేధించారు. నేలపైకి తోసేశారు" అని ఫొగాట్ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా భజ్‌రంగ్ పునియా మాట్లాడుతూ.. "మేం గెలుచుకున్న పతకాలన్నింటినీ వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం" అని ఉద్వేగానికి గురయ్యాడు.

# దేశం గర్వించేలా పతకాలు తెచ్చిన రెజ్లర్లకు ఇదేనా రివార్డ్?.. రేవంత్ ఫైర్



హైదరాబాద్: దేశ రాజధాని ఢిల్లీలో మహిళా రెజ్లర్లతో ఢిల్లీ పోలీసులు దురుసుగా ప్రవర్తించడంపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. "మహిళా సాధికారతపై బీజేపీ బూటకపు మాటలు చెబుతుండగా, ఒక ఒలింపిక్ పతక విజేత, ఇతర రెజ్లర్‌లపై ఢిల్లీ పోలీసులు అర్ధరాత్రి దురుసుగా ప్రవర్తించారు. ప్రభుత్వం నిరసనకారులపై తన బలాన్ని ప్రయోగిస్తోంది. కానీ లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీపై ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు!. పతకాలు తెచ్చి దేశం గర్వించేలా చేసినందుకు ఇదేనా రివార్డ్...?!" అంటూ రేవంత్ ట్వీట్ చేశారు. కాగా.. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ బ్రిజ్ భూషణ్ సింగ్‌పై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న తమపై ఢిల్లీ పోలీసులు దుర్భాషలాడుతూ అసభ్యంగా ప్రవర్తించారని మహిళా రెజ్లర్లు ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన తెలుపుతున్న తమపై గత అర్ధరాత్రి ఢిల్లీ పోలీసులు అసభ్యంగా ప్రవర్తించారని బజరంగ్ పునియా, సాక్షి మాలిక్‌లతో పాటు భారత అగ్రశ్రేణి రెజ్లర్లలో ఒకరైన వినేష్ ఫోగట్ ఆరోపించారు. "మమ్మల్ని చంపాలనుకుంటే చంపేయండి" వినేష్ ఫోగట్ కన్నీళ్లు పెట్టుకున్నారు. "ఈ రోజు చూడ్డానికి మనం దేశం కోసం పతకాలు సాధించామా? మేం తిండి కూడా తినలేదు. మహిళలను దుర్భాషలాడే హక్కు ప్రతి పురుషుడికి ఉందా? ఈ పోలీసులు తుపాకులు పట్టుకున్నారు, వారు మమ్మల్ని చంపుతారు" అని వినేష్ ఫోగట్ అన్నారు.

# వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు.. మంత్రి కేటీఆర్‌కు ఆహ్వానం



హైదరాబాద్ : వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు హాజరవ్వాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సు ఈ ఏడాది జూన్ 27 నుంచి 29వ తేదీ వరకు జరగనుంది.

ఈ సదస్సుకు చైనాలోని టియాంజిన్ వేదిక కానుంది. ఈ మేరకు వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు హాజరు కావాలని రాష్ట్ర మంత్రి కేటీఆర్‌కు డబ్ల్యూఈఎఫ్ అధ్యక్షుడు బోర్గె బ్రెండే ఆహ్వానం పంపారు. కొత్త ప్రణాళికలు, సాంకేతికతతో తెలంగాణ దూసుకెళ్తోందని బోర్గె ప్రసంశల వర్షం కురిపించారు.

# పార్టీలోకి ఎవరొచ్చినా ఆహ్వానిస్తాం



కరీంనగర్ : పార్టీలోకి ఎవరు వచ్చినా ఆహ్వానిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పేర్కొన్నారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బీజేపీలోకి వస్తారంటూ జరుగుతున్న ప్రచారంపై బండి సంజయ్ స్పందించారు. కుటుంబ పాలన పోవాలంటే బీజేపీ రావాలన్నారు. పొంగులేటితో ఈటల బృందం భేటీ విషయమై తనకు సమాచారం లేదన్నారు. తనకు చెప్పకపోవటం తప్పేమీ కాదన్నారు. పార్టీలో ఎవరి పనులు వారు చేసుకుంటూ వెళ్తారన్నారు. తనకు తెలిసిన వారితో తాను.. ఈటలకు తెలిసిన వారితో ఆయన మాట్లాడుతున్నామని బండి సంజయ్ తెలిపారు. నేడు పొంగులేటిని కలవనున్న బీజేపీ చేరికల కమిటి కలవనుంది. ఈటెల రాజేందర్ ఆధ్వర్యంలో చేరికల కమిటీ సభ్యులు కొండా విశ్వేశ్వరరెడ్డి. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, రఘునందనరావు మరికొందరు బీజేపీ నాయకులు నేడు పొంగులేటిని తమ పార్టీలోకి ఆహ్వానించనున్నారు. పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇంటిలో లంచ్ మీటింగ్‌కు నేతలు హాజరుకానున్నారు. ఇప్పటికే పలుమార్లు బీజేపీ చేరికల కమిటీ నేతలు పొంగులేటిని కలిశారు. నేడు పొంగులేటి పార్టీ మార్పుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అయితే పొంగులేటి బీజేపీలో చేరటం దాదాపు ఖాయమని అనుచరులు చెబుతున్నారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో పొంగులేటి బీజేపీలో చేరుతారని అంటున్నారు. కర్ణాటక ఎన్నికల అనంతరం పెద్ద ఎత్తున బహిరంగ సభను ఏర్పాటు చేసి బీజేపీలో చేరుతారని తెలుస్తోంది గత ఆగస్ట్ 21న మునుగోడులో అమిత్ షా బహిరంగ సభలో కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి కాషాయ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. పొంగులేటి చేరికతో ఉమ్మడి ఖమ్మం జిల్లాపై కమలం పార్టీ గురి పెట్టనుంది.

పొంగులేటితో పాటు.. మాజీమంత్రి జూపల్లికి కూడా కాషాయ కండువా కప్పేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోంది.

# హైకోర్టు వద్ద వ్యక్తి దారుణ హత్య.. అంతా చూస్తుండగానే కత్తితో పొడిచి..




హైదరాబాద్: హైదరాబాద్‌లోని హైకోర్టు సమీపంలో దారుణ హత్య జరిగింది. హైకోర్టు గేటు నంబర్ 6 వద్ద ఓ వ్యక్తిని దుండగుడు కత్తితో పొడిచి చంపాడు. నడిరోడ్డుపై అంతా చూస్తుండగానే హత్యచేసి అక్కడి నుంచి పారిపోయాడు. రూ. 10 వేల విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగినట్లు తెలుస్తున్నది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. మృతుడిని హైకోర్టు సమీపంలో ఉన్న సులభ్ కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న మిథన్‌గా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com